ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రత శుక్రవారం గరిష్ఠం : 30.0 కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY 5 శ్రీ సత్యసాయి జిల్లా వార్తలు
శనివారం 19 జూలై 2025

నిబంధనలు ఉల్లంఘిస్తే షాపులు సీజ్
● విద్యాసంస్థల సమీపాన పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే కేసులు
● ఎస్పీ రత్న హెచ్చరిక
6
నేలరాలని చినుకు..!
సాగుకు నోచుకోని పొలాలు
మరో పక్క ఎండుతున్న పంటలు

చెత్తను క్లియర్ చేస్తాం

● డంపింగ్ యార్డు స్థలంలో పార్కు
● రూ.736 కోట్లతో ఇంటింటికీ కొళాయి
● పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ
● డంపింగ్ యార్డులో బయోమైనింగ్ యూనిట్ ప్రారంభం


అనంతపురం డంపింగ్ యార్డులో కలెక్టర్, ఎమ్మెల్యేతో కలిసి పర్యటిస్తున్న మంత్రి నారాయణ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): బయోమైనింగ్ యూనిట్ ద్వారా డంపింగ్ యార్డులో ఉన్న చెత్త మొత్తం క్లియర్ అవుతుందని పట్టణాభివృద్ధి, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. తద్వారా ఏర్పడే ఖాళీ స్థలంలో పార్కు ఏర్పాటు చేస్తామని తెలిపారు. నగర శివారులోని గుత్తి రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డులో బయోమైనింగ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను కలెక్టర్ వినోద్ కుమార్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, అనంతపురం కార్పొరేషన్, తాడిపత్రి, గుంతకల్లు, రాయదుర్గం, గుత్తి, కళ్యాణదుర్గం మున్సిపాలిటీల్లో ప్రతి ఇంటికీ కొళాయిని ఏర్పాటు చేసి అమృత్ పథకం ద్వారా తాగునీరు అందిస్తామని అన్నారు. ఇందుకు రూ.736 కోట్లు (మిగతా 6లో..)

ఆత్మరక్షణలో దీపిక వర్గం

పురంలో కొండూరు వేణుగోపాల్‌రెడ్డి ప్రెస్‌మీట్
సస్పెండ్ అయినవారితోనే ప్రజాప్రతినిధులు
వైసీపీలో కలకలం రేపుతున్న పరిణామాలు



బలనిరూపణ కోసం చిలమత్తూరులో సమావేశం

హిందూపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ నుంచి ఇద్దరు ముఖ్య నాయకులను ఒకేసారి సస్పెండ్ చేయడంతో దీపిక వర్గం ఆత్మరక్షణలో పడింది. దీన్నుంచి బయటపడేందుకు బలనిరూపణకు సిద్ధమౌతోంది. సస్పెన్షన్‌లపై నవీన్ నిశ్చల్, కొండూరు వేణుగోపాల్ రెడ్డి స్పందించారు. తమపై చర్యల వెనుక కుట్ర ఉందని ఆరోపించారు. పార్టీ కోసం కష్టపడినందుకు ఇచ్చిన బహుమతి సస్పెన్షన్ అని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదిలోపు స్థానిక ఎన్నికలు ఉన్నాయి. ఈ తరుణంలో తాజా పరిణామాలు వైసీపీలో కలవరం పుట్టిస్తున్నాయి. దీపిక వర్గాన్ని టార్గెట్ చేసి, నియోజకవర్గంలో వారికి బలం లేదని నిరూపించేందుకు నవీన్ నిశ్చల్, కొండూరు వేణు వర్గాలు ప్రయత్నాలు ప్రారంభించాయి. దీంతో మునుముందు తమ పార్టీలో రాజకీయం రసవత్తరంగా ఉటుందని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీని బలోపేతం చేయడంపోయి బలహీనపరుచుకోవడం ఏమిటని వైసీపీ నాయకులే బహిరంగ విమర్శలు గుప్పిస్తున్నారు.

మండలస్థాయి సమావేశమే అయినా..

వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక, ఆమె భర్త వేణురెడ్డి ఉన్నట్లుండి చిలమత్తూరులో శుక్రవారం వైసీపీ విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. మండల స్థాయి సమావేశం అని చెప్పినా, నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న నాయకులను పిలిపించారు. లేపాక్షి, హిందూపురంలో కూడా ఇలాంటి సమావేశాలు ఏర్పాటు చేస్తామని దీపిక వర్గం అంటోంది. ఇద్దరు కీలక నాయకులను సస్పెండ్ (మిగతా 6లో..)


చిలమత్తూరు సమావేశంలో పాల్గొన్న వైసీపీ పురం సమన్వయకర్త దీపిక, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘని, చౌళూరు మధుమతి తదితరులు

లైనింగ్ పనులను వేగవంతం చేయండి: కలెక్టర్ చేతన్


హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి టౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) కాలువ లైనింగ్ పనులు వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. లైనింగ్ పనుల పురోగతిపై కలెక్టరేట్‌లో శుక్రవారం అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు మూడు ఏజెన్సీలకు అప్పగించామనీ, వాటిని వేగవంతం చేయాలని ఆదేశించారు. సమీక్షలో హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ రాజ్‌స్వరూప్‌కుమార్, ఈఈలు మురళి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ఏజెన్సీ ప్రతినిధులు రఘురామరాజు, క్రిష్ణయ్య, పూర్ణప్రసాద్, వెంకట్రావు, మహేంద్రరెడ్డి పాల్గొన్నారు.

21న మడకశిరకు హోంమంత్రి

మడకశిర టౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఈనెల 21న నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. పట్టణంలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ.. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో హోంమంత్రి పాల్గొంటారన్నారు. మడకశిరలో బహిరంగ సభలో ప్రసంగిస్తారన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

కన్నీటి తడి!

పీబీసీకి పూర్తిస్థాయిలో రాని సాగునీరు

» పడిపోయిన భూగర్భ జలమట్టం
» ఎండిపోతున్న బోర్లు, బావులు
» ఉద్యాన పంటలను తొలగిస్తున్న రైతులు
» మూడు గ్రామాల రైతులకు సాగునీటి కష్టాలు


కునుకుంట్ల వద్ద ఎండిన పీబీసీ

తాడిమర్రి, జూలై 18(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ ద్వారా పీబీసీ (పులివెందుల బ్రాంచ్ కెనాల్)కి కేటాయించిన నీరు పూర్తిస్థాయిలో విడుదల కాకపోవడంతో మండలంలోని రామాపురం, చిల్లకొండయ్యపల్లి, కునుకుంట్ల గ్రామాల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పీబీసీ ద్వారా వచ్చే నీటిని నమ్ముకుని రామాపురం గ్రామం వద్ద ఎత్తిపోత పథకంలో భాగంగా రెండు పంపులను ఏర్పాటు చేశారు. దాదాపు నాలుగు దశాబ్దాల కిందటే హెచ్చెల్సీ నుంచి 100 టీఎంసీల నీటిని పీబీసీ ద్వారా చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు అనుమతించారు. ఈ నీటిని ఎత్తిపోతల పథకానికి వాడుకోవచ్చు కానీ కునుకుంట్ల, చిల్లకొండయ్యపల్లి రైతులు వాడుకునేందుకు అనుమతించలేదు. తమ గ్రామాల మధ్యే పీబీసీ వెళ్తున్నా నీరు వాడుకునేందుకు అనుమతించకపోవడంపై రైతులు అప్పట్లోనే ఆందోళన చేశారు. అయితే కాలువ వెంట కనీసం నాలుగు నెలల పాటు నీరు వెళ్తుండటం వల్ల భూగర్భజలం మట్టం బాగా పెరిగింది. దీంతో మూడు గ్రామాల రైతులు బోరుబావులు తవ్వుకుని అందులో వచ్చే నీటి ద్వారా ఉద్యాన పంటలు సాగు చేశారు. దాదాపు 2లక్షలకుపైగా చీనీ చెట్లు, 50 వేల వరకు దానిమ్మ చెట్లు సాగు చేశారు. 200 ఎకరాల్లో అరటి పంట సాగుచేస్తున్నారు.

పడిపోయిన భూగర్భ జలమట్టం



గత ఏడాది తుంపెర డీప్‌కట్ నుంచి రావాల్సిన నీరు అరకొరగా రావడంతో రామాపురం ఎత్తిపోతలకే సరిపోయాయి. దీంతో కునుకుంట్ల, చిల్లకొండయ్యపల్లి గ్రామాలలో భూగర్భ జల మట్టం దారుణంగా పడిపోయింది. 900 అడుగులు తవ్వినా చుక్కనీరు లభించని స్థితి ఏర్పడింది. ఈక్రమంలోనే తాతల కాలం నుంచి నీటితో తొణికసలాడిన బావులు సైతం ఎండిపోయాయి. దీంతో కొందరు రైతులు ఉద్యాన పంటలను తొలగించడం ప్రారంభించారు. మరికొందరు ట్యాంకర్ నీటికి రూ.300 చెల్లించి పక్క గ్రామాల నుంచి ట్రాక్టర్‌కు రూ.900 బాడుగ ఇచ్చి చీనీచెట్లకు నీటి తడులు ఇస్తున్నారు. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఎంతో దూరంలో ఉన్న గండికోట రిజర్వాయర్ నుంచి రెండు ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని తెస్తున్నారు. అలా కాకుండా నేరుగా హెచ్చెల్సీ ద్వారా నీటి కేటాయింపులు అమలుపరిచి గ్రావిటీ ద్వారా పీబీసీకి నీరిస్తే ఎలాంటి ఖర్చులేకుండానే చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు నీరు చేరుతుంది. ఈ విషయాన్ని పాలకులు పట్టించుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

దిక్కుతోచక తొలగించా..

కళ్ల ముందే చెట్లు ఎండిపోతుంటే చూసి తట్టుకోలేక, నీటి తడులు అందించలేక చీనీ చెట్లను తొలగించా. ఎన్ని బోర్లు వేసినా నీటి జాడ లేకపోవడంతో 13 ఏళ్ల వయసున్న 370 చీనీ చెట్లను తొలగించా. సోమవారం నుంచి తొలగించడం ప్రారంభించి మంగళవారం సాయంత్రం చెట్లన్నింటిని తగలపెట్టా. దాదాపు రూ.10లక్షలు నష్టం వచ్చింది. ఇంకా ఆరేళ్ల పాటు బాగా కాయలు కాసే చెట్లను తప్పనిసరి పరిస్థితుల్లో తొలగించుకోవాల్సి వచ్చింది.

-శివానందరెడ్డి, రైతు

ఎండుతున్న బావులు



తాతల కాలం నుంచి నీటితో నిండుగా ఉన్న బావులు కూడా ఎండిపోతున్నాయి. గడచిన ఐదేళ్ల నుంచి వేసవి కాలం వచ్చిందంటే ఎప్పుడు నీరు ఇంకిపోతుందోననే ఆందోళన నెలకొంటోంది. జిల్లాలోనే చీనీ పంట ఎక్కువగా సాగుచేస్తున్న మా గ్రామం గురించి పాలకులు పట్టించుకోవాలి.

- ఓబులేసు, రైతు, కునుకుంట్ల


కొట్టేసిన చీనీచెట్లకు నిప్పు పెట్టిన రైతులు

పీబీసీ నీరే శరణ్యం



పులివెందుల బ్రాంచ్ కెనాల్ ద్వారా నీరు ప్రవహిస్తేనే మా గ్రామం బాగుపడుతుంది. భూగర్భజల మట్టం పెరిగి పంటలను పండించుకోగలం. లేదంటే ఇప్పటికే చాలా మంది రైతులు నీటి కోసం బోర్లు వేసి అప్పులపాలయ్యారు. మరింత మంది ఇబ్బందులు పడకుండా ఉండాలంటే హెచ్చెల్సీ నుంచి నీరిచ్చే ఏర్పాటు చేయాలి.

- దామోదర్, రైతు, కునుకుంట్ల


తుంపెర డీప్ కట్ వద్ద అడ్డుగా వేసిన మట్టి

విద్యాశాఖ నిద్రమత్తు..!

టీచర్లకు హ్యాండ్ బుక్స్ పంపిణీలో నిర్లక్ష్యం
పుస్తకాలు వచ్చినా అందజేయని వైనం
ఉపాధ్యాయులకు తప్పని ఎదురుచూపులు



ధర్మవరం, జూలై 18(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో సంస్కరణలకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంటే, ఆ శాఖ అధికారులు మాత్రం మొద్దునిద్రలో జోగుతున్నారు. పాఠ్యప్రణాళికలు, టీచర్ల బోధన, అభ్యాసన కరదీపికలను ఈ ఏడాది ప్రభుత్వమే ముద్రించి, ఉపాధ్యాయులకు అందిస్తోంది. వాటిని జిల్లాకు సరఫరా చేసింది కూడా. అయినా.. జిల్లా విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వాటిని ఉపాధ్యాయులకు అందించలేదు. స్కూల్ కాంప్లెక్స్‌ల ద్వారా అందిస్తారని ఉపాధ్యాయ వర్గాల ద్వారా తెలిసింది. పంపిణీకి సంబంధించి నేటికీ స్పష్టత లేకపోవడం విద్యాశాఖాధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట.

సరఫరా చేసినా..

గతంలో టీచర్లకు హ్యాండ్‌బుక్స్ ప్రభుత్వం సరఫరా చేసేది కాదు. దీంతో ఉపాధ్యాయులు సొంత డబ్బుతో వాటిని కొనుగోలు చేయాల్సి వచ్చేది. అందుకు భిన్నంగా ఈ ఏడాది టీచర్లకు అవసరమైన హ్యాండ్ బుక్స్, పాఠ్యప్రణాళికల పుస్తకాలను ప్రభుత్వమే సరఫరా చేయాలని నిర్ణయించింది. వాటి కోసం నెలరోజులుగా ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్నారు. మారిన విద్యావిధానం నేపథ్యంలో బయట లభించే పుస్తకాలను కొనుగోలు చేసి రాసుకోలేని పరిస్థితి. ఈ నేపథ్యంలో దాదాపు పక్షం రోజుల క్రితం ప్రభుత్వం.. జిల్లాకు వాటిని సరఫరా చేసింది. టీచర్లకు అందజేయడంలో విద్యాశాఖాధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడం శోచనీయం. ఇప్పటికైనా అధికారులు.. ఆయా పుస్తకాలను అందించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

గతంలో కొనేవాళ్లం..



గతంలో హ్యాండ్‌బుక్స్‌ను ఉపాధ్యాయులు సొంత డబ్బుతో కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం ప్రభుత్వమే ఉచితంగా ఇస్తుండడం హర్షణీయం. విద్యార్థులకు బోధించడానికి వీలుంటుంది. వాటిని సకాలంలో అందజేస్తే మరీ బాగుంటుంది.

- శెట్టిపి జయచంద్రారెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

త్వరగా అందజేయాలి..



టైటిల్ బుక్స్, హ్యాండ్ బుక్స్ త్వరగా టీచర్లకు అందించాలి. ఎఫ్ఏ-1 పరీక్షకు సమయం దగ్గర పడుతోంది. ప్రాజెక్టులు, ప్రాంతాలను విద్యార్థులకు తెలియజేసేందుకు ఈ పుస్తకాలు ఎంతో అవసరమవుతాయి. విద్యాశాఖ అధికారులు వీటిని త్వరగా అందజేయాలి.

- అమరా చంద్రబాబునాయుడు, ఆపస్ జిల్లా అధ్యక్షుడు

త్వరలో హ్యాండ్ బుక్స్ పంపిణీ చేస్తాం



జిల్లాలో 2,070 ప్రభుత్వ పాఠశాలల్లోని 47,143 మంది ఉపాధ్యాయులకు సంబంధించి హ్యాండ్ బుక్స్, 51 టైటిల్స్ వచ్చాయి. ఇప్పటికే ఆలస్యమైంది. వాటిని త్వరలోనే పంపిణీ చేస్తాం.

-కిష్టప్ప, డీఈఓ, శ్రీసత్యసాయి జిల్లా

తల్లీబిడ్డను కాపాడుకుందాం

డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్ బేగం


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్ బేగం

పుట్టపర్తి రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలించి, లోపాలను సరి చేసుకుని, సమష్టిగా పనిచేసి తల్లీబిడ్డను కాపాడుదామని డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్‌బేగం పేర్కొన్నారు. స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మాతాశిశు మరణాలపై జిల్లాస్థాయి సమీక్షా సమావేశంలో ఆమె పాల్గొన్నారు. జిల్లాలో వివిధ ఆసుపత్రులలో జూన్ నెలలో సంభవించిన 8 శిశుమరణాలపై సమీక్షించారు. అనంతరం డీఎంహెచ్ఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్‌లో భాగంగా ప్రతినెల 9వ తేదీ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో గర్భవతులకు గ్రూపు సమావేశం నిర్వహించి, వారికి ఆరోగ్య విద్యనందించాలన్నారు. హైరిస్క్ గర్భిణుల పట్ల కాన్పు అయ్యేంత వరకు ప్రత్యేక దృష్టితో ఉండాలన్నారు. ఏబిడ్డా జన్మిస్తూ మరణించకూడదు, ఏతల్లి జన్మనిస్తూ మరణించకూడదని డీసీహెచ్ఎస్ డాక్టర్ మధుసూదన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ నాగేంద్రనాయక్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ పీఎస్ మంజువాణి, గైనకాలజిస్టు డాక్టర్ ప్రత్యూష , పీడియాట్రీషియన్ డాక్టర్ శ్రీనునాయక్, డీపీహెచ్ఎన్ఓ వీరమ్మ, జిల్లాలోని పీహెచ్‌సీ వైద్యాధికారులు, పర్యవేక్షక సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

లీడర్‌షిప్‌పై శిక్షణ


మాట్లాడుతున్న ఆర్‌జే రత్నాకర్

పుట్టపర్తి, జూలై 18(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా భక్తులైన యువతకు లీడర్‌షిప్‌పై మూడు రోజుల శిక్షణా తరగతులను శుక్రవారం ప్రారంభించారు. ప్రశాంతి నిలయంలోని సాయిహీరా గ్లోబల్‌కన్వెన్షన్ సెంటర్‌లో సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జేరత్నాకర్ జ్యోతిప్రజ్వలన చేసి శిక్షణ తరగతులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవితంలో తల్లిదండ్రుల తరువాత గురువు, దైవమే ముఖ్యమన్నారు. గురుబోధనతో జీవితాలకు ఓ సార్థకత వస్తుందన్నారు. సత్యసాయి చూపిన సేవా, ప్రేమ, బోధనలను జీవిత ఆశయాలుగా తీసుకుని ముందుకు వెళ్లాలన్నారు. సత్యసాయి బోధించిన ధర్మం, శాంతి, ప్రేమ, సత్యం, అహింస పంచసూత్రాలను జీవిత ఆశయాలుగా మార్చుకుని ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ జోన్-8 చైర్మన్ సత్యపాలన్, జోన్-9 చైర్మన్ సుబ్రినాయుడు తమ ప్రసంగాలను వినిపించారు. మొదటి రోజు శిక్షణా తరగతులకు 18 దేశాల నుంచి 500 మంది యువత హాజరయ్యారు.

భూసార పరీక్షలు పక్కాగా నిర్వహించాలి

● జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ



భూసార పరీక్షను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలు పక్కాగా నిర్వహించాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. స్థానిక అనంతపురం భూసార పరీక్షా కేంద్రాన్ని శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఎన్‌పీకే, సూక్ష్మపోషకాల పరీక్ష పద్ధతులపై ఆరా తీశారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటిదాకా వచ్చిన మట్టి నమూనాలు, చేసిన పరీక్షలు తదితర వివరాలు ఆరాతీశారు. అందుకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఈ ఏడాది జిల్లాకు 25,107 భూసార పరీక్షలు చేయాలని లక్ష్యం విధించగా.. ఇప్పటి దాకా 7,236 మట్టి నమూనాలు పరీక్షా కేంద్రానికి వచ్చాయనీ, వీటిలో 4,917 పరీక్షలు పూర్తి చేశామని భూసార పరీక్షాకేంద్రం ఏడీఏ రోజాపుష్పలత వివరించారు. లక్ష్యం మేరకు భూసార పరీక్షలు నిర్వహించి, ఆన్‌లైన్‌లో వాటి ఫలితాలను నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓలు శ్రీనాథ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ఉమామహేశ్వరి, మెహరున్నీషా బేగం, కృష్ణకుమారి, నివేదిత, ఏఈఓ గంగుప్ప పాల్గొన్నారు.

భూసార పరీక్షాకేంద్రానికి ఎన్‌ఏబీఎల్ అక్రెడిటేషన్

కేంద్ర ప్రభుత్వ క్వాలిటీ కంట్రోల్ విభాగానికి చెందిన నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఆఫ్ టెస్టింగ్, క్యాలిబ్రేషన్ లేబొరేటరీస్ (ఎన్‌ఏబీఎల్) నుంచి అనంత భూసార పరీక్షా కేంద్రానికి అక్రెడిటేషన్ వచ్చినట్లు జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. భూసార పరీక్షా కేంద్రం తనిఖీకి వచ్చిన ఆమెకు ఏడీఏ రోజా పుష్పలత అక్రెడిటేషన్‌ను అందజేశారు. మూడేళ్లపాటు ఈ గుర్తింపు ఉంటుందన్నారు. మట్టి సేకరణ, వాటి ద్వారా స్థూల, సూక్ష్మపోషకాల శాతం తెలుసుకునేందుకు 12 రకాల పరీక్షలు నిర్వహించడం, ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, ఫలితాలను సకాలంలో రైతులకు అందించడం.. లక్ష్యం మేరకు భూసార పరీక్షలు నిర్వహించడం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, అక్రెడిటేషన్ ఇచ్చినట్లు వివరించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే షాపులు సీజ్

విద్యాసంస్థల సమీపాన పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే కేసులు

ఎస్పీ రత్న హెచ్చరిక



పాఠశాల సమీపంలోని షాపులో తనిఖీ చేస్తున్న పోలీసులు

పుట్టపర్తి రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా పొగాకు ఉత్పత్తులను విక్రయిస్తే షాపులను సీజ్ చేస్తామని ఎస్పీ రత్న హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో ఉన్న షాపుల్లో సిగరెట్, ఇతర పొగాకు ఉత్పత్తులను విక్రయించడం నిషేధమన్నారు. ఆ మేరకు విద్యాసంస్థల సమీపంలోని షాపుల్లో తనిఖీలు చేయాలని పోలీసులను ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే దుకాణాలను సీజ్ చేసి, యజమానులపై కేసులు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాలతో జిల్లావ్యాప్తంగా పోలీసులు.. దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు.

రేపటి నుంచి మస్తాన్‌వలి ఉరుసు



మస్తాన్ వలి దర్గా

గుంతకల్లుటౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత గుంతకల్లులో వెలసిన హజరత్ సయ్యద్ మస్తాన్ వలి స్వామి 390వ ఉరుసు ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉరుసు ఉత్సవాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ రహీం తెలిపారు. ఆదివారం గంధం, సోమవారం షంషీర్, మంగళవారం జియారత్ కార్యక్రమం నిర్వహిస్తారు. ఉరుసు ఉత్సవాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ఉరుసు ఉత్సవాలకు వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం, దర్గా ఆవరణలో షామియానాలు, విద్యుత్ కోసం జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తాగునీటి ట్యాంకర్లను అందుబాటులో ఉంచారు. మొబైల్ టాయిలెట్లను సిద్ధం చేశారు. దర్గాను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. దర్గా ఆవరణంలో 24 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గంధం, షంషీర్ రోజు భక్తుల సౌకర్యార్థం వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

ఓపీఎస్‌తోనే న్యాయం

● 2003 డీఎస్సీ టీచర్ల డిమాండ్ ● కలెక్టరేట్ వద్ద నిరసన
● సంఘీభావం తెలిపిన ఉపాధ్యాయ సంఘాలు

అనంతపురం విద్య, జూలై18(ఆంధ్రజ్యోతి): పాత పెన్షన్ విధానా(ఓపీఎస్)ను వర్తింపజేసి, న్యాయం చేయాలని 2003 డీఎస్సీ టీచర్లు డిమాండ్ చేశారు. ఓపీఎస్ అమలు కోరుతూ 2003 డీఎస్సీ టీచర్ల ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. ఫోరం నాయకుడు మధుప్రసాద్ మాట్లాడుతూ.. ఓపీఎస్ అమలుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం మెమో 57ను జారీచేసిందన్నారు. దాదాపు 16 రాష్ట్రాల్లో ఆ మేరకు అమలు చేశారన్నారు. ఏపీలో కూడా అమలుచేయాలని కోరారు. రాష్ట్రంలో నూతన పెన్షన్ (సీపీఎస్) అమలుకు ముందే నోటిఫికేషన్ వచ్చిందన్నారు. నియామకాల పక్రియ వివిధ కారణాలతో అప్పట్లో ఆలస్యమైందన్నారు. సీపీఎస్ జీఓ వచ్చిన తర్వాత విధుల్లో చేరామంటూ తమకు పాత పెన్షన్ వర్తింపజేయకపోవడం అన్యాయమన్నారు. ఓపీఎస్‌తో న్యాయం చేయాలని కోరారు. మధ్యాహ్నం వరకు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. నిరసనకు ఉపాధ్యాయసంఘాల నేతలు శ్రీనివాసనాయక్, పాపిరెడ్డి, సిరాజుద్దీన్, వెంకటేష్, రమణారెడ్డి, రామాంజనేయులు, వెంకటరత్నం, గోపాల్‌రెడ్డి, గోవిందు, లింగమయ్య, శివానందరెడ్డి, ఎర్రిస్వామి, అక్కులప్ప, పురుషోత్తంరెడ్డి, రవీంద్రనాయక్, శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు. నిరసనలో 2003 డీఎస్సీ ఫోరం నాయకులు మారుతి, నాగభూషణ, ఎర్రిస్వామి, సాయినాథ్‌రెడ్డి, ప్రసన్నలక్ష్మి, వరదరాజులు, నాగేంద్ర, చంద్ర, సుదర్శన్ తోపాటు వందలాది మంది టీచర్లు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌వద్ద ఆందోళన చేస్తున్న 2003 డీఎస్సీ టీచర్లు

చెత్తను క్లియర్ చేస్తాం

(5వ పేజీ తరువాయి)

వెచ్చిస్తామని తెలిపారు. పాతూరు మార్కెట్‌ను వేరే చోటుకు తరలిస్తామని అన్నారు. అనంతలో భూగర్భ డ్రైనేజీ ఏర్పాటుకు మరికొంత సమయం పడుతుందని అన్నారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు త్వరలో శుభవార్త చెబుతామని అన్నారు. బయోమైనింగ్ ద్వారా వైసీపీ ప్రభుత్వం నిల్వ చేసిన 1.65 లక్షల టన్నుల చెత్తను క్లియర్ చేస్తామని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. తద్వారా చెత్త రహిత అనంతను తీర్చిదిద్దుతామని అన్నారు. అక్టోబరు 2 నాటికి డంపింగ్ యార్డులో చెత్త లేకుండా చేస్తామని, 12.6 ఎకరాల్లో పార్కు ఏర్పాటు చేస్తామని అన్నారు. దీనికోసం స్పెషల్ గ్రాంట్ విడుదల చేయాలని మంత్రిని కోరారు. అనంతరం కార్పొరేషన్‌లో రూ.1.7కోట్ల సాధారణ నిధులతో రోడ్లు, మురుగు కాలవల నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. లెగసీ డంప్ యార్డును పరిశీలించిన మంత్రి, అక్కడ మొక్కలు నాటారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు వైస్ చైర్మన్ వెంకట శివుడు యాదవ్, అహుడా చైర్మన్ టీసీ వరుణ్, నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, డిప్యూటీ కమిషనర్ పావని, టీడీపీ నాయకులు ఆదినారాయణ, ఆదెన్న, సింగవరం రవి, పరమేష్, నరసింహులు, బుగ్గయ్యచౌదరి, సరిపూటి రమణ, బల్లా పల్లవి, బొమ్మినేని శివ, కార్పొరేటర్ చలివెందుల బాలాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.



అనంతపురంలో రోడ్డు, డ్రైనేజీ కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి నారాయణ, పాల్గొన్న కలెక్టర్ వినోద్ కుమార్, ఎమ్మెల్యే దగ్గుపాటి, టీసీ వరుణ్, వెంకటశివుడు యాదవ్ తదితరులు

ల్యాండ్ బ్యాంక్‌ను గుర్తించండి

సచివాలయ ఉద్యోగులకు త్వరలో ప్రమోషన్‌లు: మంత్రి నారాయణ



సమీక్షిస్తున్న మంత్రి నారాయణ

అనంతపురం కలెక్టరేట్ జూలై 18(ఆంధ్రజ్యోతి): అహుడా పరిధిలో ల్యాండ్ బ్యాంక్‌ను గుర్తించాలని మంత్రి నారాయణ సూచించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, అహుడా చైర్మన్ టీసీ వరుణ్‌తో కలిసి మంత్రి నారాయణ నగరపాలిక, అహుడా, పబ్లిక్‌హెల్త్ శాఖల అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని మున్సిపాలిటీలను మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. ఎంఐజీ లే అవుట్స్‌ను అభివృద్ధి చేసి, ప్రజలకు ప్లాట్లను కేటాయించాలని ఆదేశించారు. నగరం, పట్టణాలకు దగ్గర్లో మంచి భూములను చూడాలని, లే అవుట్స్‌లో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను ఏర్పాటు చేయాలని సూచించారు. చిన్న మున్సిపాలిటీలలో అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని అన్నారు. కళ్యాణదుర్గం ఎస్సీ కాలనీలలో అభివృద్ధి పనుల కోసం రూ.25 లక్షలను మంజూరు చేస్తున్నామని తెలిపారు. సీఎం చంద్రబాబు సచివాలయ ఉద్యోగులకు గ్రేడ్-2 నుంచి గ్రేడ్-1కు ప్రమోషన్లను త్వరలో ఇస్తారని తెలిపారు. వారిని డెప్యుటేషన్‌ల ద్వారా నగరపాలికలో నియమించుకోవచ్చని అధికారులకు సూచించారు. అహుడా పరిధిలో మరింత ల్యాండ్ బ్యాంక్‌ను గుర్తిస్తామని కలెక్టర్ అన్నారు. నగరంలో కాపు, బీసీ భవన్ కోసం స్థలాలను కేటాయిస్తామని తెలిపారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఇండోర్ స్టేడియంలో మరమ్మతులు, మున్సిపల్ పార్కుల్లో జిమ్ పరికరాలు, సిటీ సర్వీస్ బస్సులు, ప్రభుత్వాసుపత్రి సమీపంలో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కోరారు. కళ్యాణదుర్గం ఎస్సీ కాలనీలో అభివృద్ధి పనులకు రూ.50 లక్షలు మంజూరు చేయాలని, వాల్మీకి భవనాన్ని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సురేంద్రబాబు కోరారు. ఎంఐజీ లే అవుట్స్‌లో అభివృద్ధి పనులు చేపట్టాలని అహుడా చైర్మన్ టీసీ వరుణ్ కోరారు. సమావేశంలో జిల్లా ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, నగరపాలిక కమిషనర్ బాలస్వామి, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రామ్మోహన్‌రెడ్డి, ఈఈ ఆదినారాయణ, నగరపాలిక ఈఈ షాకీర్, టిడ్కో ఈఈ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలకు టీచర్స్ హ్యాండ్‌బుక్స్



టీచర్స్ హ్యాండ్‌బుక్స్‌ను తరలిస్తున్న దృశ్యం

అనంతపురం విద్య, జూలై18(ఆంధ్రజ్యోతి): టీచర్స్ హ్యాండ్ బుక్స్‌ను పాఠశాలలకు శుక్రవారం సరఫరా చేశారు. గతంలో టీచర్లే హ్యాండ్‌బుక్స్ రాసుకుని, పాఠశాలలకు తీసుకెళ్లి పిల్లలకు బోధించేవారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఉపాధ్యాయులందరికీ ఒకే తరహా హ్యాండ్ బుక్స్ ఉండాలని నిర్ణయించారు. ఆ మేరకు ప్రత్యేకంగా హ్యాండ్‌బుక్స్ ముద్రించి, జిల్లాకు పంపారు. అనంత జిల్లాకు 1,729 పాఠశాలలకుగాను 39,569 హ్యాండ్స్ బుక్స్ వచ్చాయి. వాటిని జిల్లాలోని 1,729 పాఠశాలలకు ప్రత్యేక వాహనాల్లో సరఫరా చేసినట్లు డీసీఈబీ సెక్రటరీ గంధం శ్రీనివాసులు తెలిపారు.

అలరించిన శకుని

అనంతపురం టౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని లలితకళా పరిషత్‌లో 'శకుని' నాటకాన్ని శుక్రవారం సాయంత్రం ప్రదర్శించారు. అహుడా చైర్మన్ టీసీ వరుణ్‌తోపాటు డీఆర్ఓ మలోల ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అనంత కళాఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయాలని సూచించారు. సమాజంలో ఎంతటి పాశ్చాత్య పోకడలు వస్తున్నప్పటికీ లలితకళా పరిషత్ తరఫున రంగస్థల కళలకు పెద్దపీట వేస్తూ కళాకారులను ప్రోత్సహిస్తుండడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రదర్శించిన శకుని నాటకంలో కళాకారులు తమదైన శైలిలో నటనా పాఠవాలను ప్రదర్శించి వీక్షకులను అలరింపజేశారు. పరిషత్ ప్రధాన కార్యదర్శి గాజుల పద్మజ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గురుప్రసాద్, ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం అనంతపురం శాఖ ప్రతినిధి శారద, ఎస్కేయూ విశ్రాంత ప్రొఫెసర్ రామగోవింద్ సాగర్, అస్లాం బాషా తదితరులు పాల్గొన్నారు.



నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

ఆత్మరక్షణలో దీపిక వర్గం

(5వ పేజీ తరువాయి)

చేసినా, పార్టీకి ఎక్కడా ఇబ్బంది లేదని చూపించుకునేందుకు దీపిక వర్గం ఈ ఎత్తులు వేస్తోందని అసమ్మతివర్గం విమర్శిస్తోంది.

వేటు పడినా వెంటే..

నవీన్ నిశ్చల్, కొండూరు వేణు నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైసీపీకి చెందిన వారి వర్గీయులు పాల్గొన్నారు. కర్నాటక నుంచి దిగుమతి చేసుకున్న మహిళకు టిక్కెట్ ఇచ్చినా పనిచేశామని, అయినా తమ నాయకులపై చర్యలు తీసుకోవడం ఏమిటని వారు నిలదీస్తున్నారు. ఇలా అయితే పార్టీ భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతుందని హెచ్చరించారు. పార్టీని నమ్ముకున్న నాయకుల పట్ల ఇలా వ్యవహరించడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇద్దరు నాయకులపై పార్టీ చర్యలు తీసుకున్నా.. స్థానిక ప్రజాప్రతినిధులు వారి వెంటనే నిలిచారు. కొండూరు వేణుగోపాల్‌రెడ్డి నిర్వహించిన విలేకరుల సమావేశంలో లేపాక్షి జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ భర్త నారాయణ స్వామి, చిలమత్తూరు ఎంపీటీసీ జగన్, రాజారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి హనుమంతరెడ్డి, సాదిక్, సీఎన్‌పీ నాగరాజు, నరసింహారెడ్డి, అశ్వత్థనారాయణ, సలీం, తిప్పన్న, కొంతమంది సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఈ పరిణామాలు దీపిక వర్గాన్ని కలవరపెడుతున్నాయి.

కష్టపడినందుకు పదోన్నతి: కొండూరు

'మూడు దశాబ్దాలకుపైగా వైఎస్ కుటుంబాన్ని నమ్ముకున్నాను. కాంగ్రెస్, వైసీపీలో కష్టపడి, నష్టపోయినందుకు సస్పెండ్ చేసి పదోన్నతి కల్పించారు' అని వైసీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు వెన్నంటే ఉన్నానని, రూ.కోట్లు పోగొట్టుకున్నానని అన్నారు. ఏ రోజూ పదవి అడగలేదని, ఎక్కడా పార్టీ లైన్ దాటలేదని అన్నారు. పార్టీ పెద్దలు ముందుచూపులేకుండా, పార్టీకోసం పనిచేసిన బలమైన నాయకులను సస్పెండ్ చేయడం బాధాకరమని అన్నారు. తనను నమ్ముకున్న కార్యకర్తలు, నాయకుల అభిప్రాయం మేరకే నడుచుకుంటానని అన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటానని, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. పార్టీ పెద్దలు పునరాలోచించాలని కోరారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ పురం మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి

నేలరాలని చినుకు..!

సాగుకు నోచుకోని పొలాలు
మరో పక్క ఎండుతున్న పంటలు
అదును దాటుతోందని రైతుల ఆందోళన

అనంతపురం అర్బన్/గుత్తి రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): కార్తెలన్నీ కరిగిపోతున్నాయి.. చినుకు జాడ మాత్రం కానరావడం లేదు. వర్షం కోసం ఆకాశం వైపు చూస్తున్న రైతన్నలకు నిరాశే మిగులుతోంది. మేఘాలు ఊరించి ఉసూరుమనిపిస్తున్నాయి. గత కొన్ని రోజులుగా సాయంత్రం వేళల్లో ఆకాశం మేఘావృతమవుతున్నా వర్షం పడటం లేదు. ఈ పరిస్థితుల్లో పొలాలు బీడుగా మారాయి. ఈనెలాఖరు దాకా వేరుశనగ విత్తనం వేసుకోవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అప్పటిలోగా పదును వర్షం పడితేనే వేరుశనగ విత్తనం వేసుకునేందుకు అవకాశం ఉంటుంది. లేదంటే ప్రత్యామ్నాయ పంటలే శరణ్యమని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈసారి ముందస్తుగానే నైరుతి రుతుపవనాలు ప్రవేశించినా ఆశించిన స్థాయిలో వానలు పడటం లేదు. అక్కడక్కడా చిరుజల్లులకే పరిమితమైంది. గత ఏడాది మే 29వతేదీ కేరళకు... జూన్ 2వతేదీ జిల్లాలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. ఈ ఏడాది మే 24న కేరళకు... 26న జిల్లాలోకి ప్రవేశించాయి. తర్వాత రెండు రోజుల్లో కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లుల నుంచి ఓ మోస్తారు వర్షం పడింది. అప్పటి నుంచి చినుకు జాడే కనిపించడం లేదు. దీంతో విత్తనం వేసుకోలేని దుస్థితి నెలకొంది.

అరకొరగానే పంటల సాగు

ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లా సరాసరి సాధారణ సాగు విస్తీర్ణం 3.39 లక్షల హెక్టార్లుగా నిర్ణయించారు. ఇందులో వేరుశనగ 1.82 లక్షల హెక్టార్లు, కంది 55,296, పత్తి 44వేలు, ఆముదం 16,293, వరి 19,466, జొన్న 1719, సజ్జ 2054, మొక్కజొన్న 14,653, రాగి 69, కొర్ర 3,311, పెసలు 455 హెక్టార్లు ఉన్నాయి. మిగతా విస్తీర్ణంలో ఉలవలు, మినుములు, అలసంద తదితర రకాల పంటలు ఉన్నాయి. ఆశించిన స్థాయిలో వానలు పడకపోవడంతో అరకొరగానే పంటలు సాగు ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి దాకా 47,051 హెక్టార్లల్లో వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఇందులో వేరుశనగ 16,973 హెక్టార్లల్లో మాత్రమే సాగయింది. మిగతా విస్తీర్ణంలో కంది, మొక్కజొన్న, ఆముదం, పత్తి, సజ్జ పంటలు సాగు చేశారు. గుంతకల్లు, గుత్తి, కంబదూరు, బ్రహ్మసముద్రం, కణేకల్లు, ఆత్మకూరు, బొమ్మనహాల్, కుందుర్పి, కూడేరు, రాయదుర్గం, వజ్రకరూరు తదితర మండలాల్లో వేరుశనగ పంట సాగు చేశారు.



సాగుకు సిద్ధంగా ఉన్న పొలం



వాడుముఖం పట్టిన ఆముదం పంట

పూత దశలో పంట.. వర్షం పడితేనే బతికేది

వేరుశనగ పంట ప్రస్తుతం పూత దశలో ఉంది. వేరుశనగ విత్తనం మొలకెత్తిన తర్వాత నుంచి 25 రోజులపాటు పంటకు బెట్టపరిస్థితులు ఉండాలి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో వేరుశనగ పంట మొలకెత్తి 30 రోజులు కావస్తోంది. ప్రస్తుతం పూత దశలో పంట ఉంది. పూత దశ నుంచి తప్పనిసరిగా పంటకు తడి అవసరం. ఆ తర్వాత ఊడలు దిగే సమయంలోనూ తడి కావాలి. కీలకమైన పూత దశలో వర్షం పడకపోవడంతో ఎదుగుదల కనిపించడం లేదు. వర్షం పడి ఉంటే పంట పూతతో కళకళలాడుతూ ఉండేది. అవసరమైన సమయంలో వర్షం పడకపోవడంతో పంటంతా వాడుదశకు చేరింది. అరకొర సాగు చేసిన వేరుశనగ పంట వాడుదశకు చేరుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రానున్న నాలుగు రోజుల్లో చిరుజల్లుల నుంచి ఓ మోస్తారు వర్షం పడే అవకాశం ఉందని వాతావరణ విభాగం ప్రకటించింది. మరోవైపు కంది, ఆముదం, సజ్జ ఇతర పంటలు సాగు చేసిన రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు.



మొలక దశలోనే వాడుముఖం

మృగశిర కార్తెలో ఐదు ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశా. గత నెల 13వతేదీ అరకొర వర్షం వచ్చింది. ఇప్పటి వరకు చినుకు జాడ కనిపించడం లేదు. వేరుశనగ పంట మొలక దశలోనే వాడు ముఖం పట్టింది. ఈ వారంలో వర్షం వస్తేనే పంట బతుకుతుంది. లేదంటే పంటంతా ఎండిపోతుంది. గత ఏడాది వర్షం సరిగా పడకపోవడంతో నష్టపోయా. వర్షం కురిస్తే ఎంతోకొంత దిగుబడి వస్తుంది. లేదంటే ఈసారీ నష్టపోవాల్సిందే. -భాస్కర్, రైతు, ఊబిచెర్ల, గుత్తి మండలం

అరకొర వర్షంలోనే పంట సాగు చేశా

ఈసారి అరకొర వర్షంలోనే కంది, సజ్జ పంట సాగు చేశా. గత ఏడాది వేరుశనగ పంట సాగు చేసి నష్టపోయా. అందుకే ఈసారి మూడెకరాల్లో కంది, సజ్జ సాగు చేశా. ఈసారి వర్షాలు వస్తాయని ఆశతో పంటను సాగు చేశాను. నెల రోజుల క్రితం పడిన వర్షం తప్పా.. ఆ తర్వాత చినుకు జాడలేదు. పరిస్థితి ఇలాగే ఉంటే కంది, సజ్జ పంటలు చేతికి అందడం కష్టమే. వరుణదేవుడు కరుణిస్తే గట్టెక్కుతాం. లేదంటే నష్టాలు తప్పవు. -రంగప్ప, రైతు, బేతాపల్లి, గుత్తి మండలం



అమ్మా.. ఇక నీ కొడుకు లేడమ్మా..!

తల్లికి వీడియో కాల్.. లైవ్‌లో యువకుడి ఆత్మహత్య



మల్లికార్జున (ఫైల్)

వెళ్లి.. వస్తానని..
అమ్మకే చెప్తివా..
పిచ్చి కన్నా..
తల్లి చూస్తుండగానే
ఉరికి వేలాడితివా..
అమ్మ గుండె
ఎంతగా తల్లడిల్లిందో..
ఒక్కసారైనా ఆలోచిస్తివా..
తల్లి కన్నీళ్లకైనా..
నీ మనసు కరగకపోయెనా..
చేతులెత్తి వేడుకున్నా..
వినకపోతివా..
ఐ లవ్ యూ.. అమ్మా.. అంటూ..
పాణం తీసుకుంటావా..
ఇంతకన్నా..
శిక్ష ఏముంటుంది కన్నా..?



ఆత్మహత్య చేసుకునే సమయంలో వీడియో కాల్‌లో విలపిస్తున్న మల్లికార్జున

బుక్కరాయసముద్రం, జూలై18(ఆంధ్రజ్యో): 'అమ్మా.. ఐ యామ్ వెరీ సారీ.. ఇక నీ కొడుకు లేడమ్మా.. జాగ్రత్తగా ఉండు.. మళ్లీ వస్తాను.. చెల్లి మానస కడుపున పుడతాను. నాకోసం మీరు ఉండాలి. నాన్నకు చెప్పు.. ప్లీజ్ మా... ఐ మిస్ యూ మా... లవ్ యూ మా...' అంటూ తల్లికి వాట్సాప్ మెసేజ్ చేశాడు. ఆ తర్వాత వీడియో కాల్ చేసి, వద్దని వేడుకుంటున్నా.. కళ్ల నీళ్ల పెట్టుకుంటున్నా వినకుండా.. తల్లి చూస్తుండగానే ఉరేసుకుని, మరణించాడు. కొడుకు మరణాన్ని చూసి తల్లి కుప్పకూలిపోయింది. మండలంలోని బొమ్మలాటపల్లి వద్ద బ్రహంగారి గుడి వెనుక గుట్టపై ఉన్న చెట్టుకు ఉరేసుకుని మల్లికార్జున(23) మరణించాడు. నార్పల మండల పులసనూతల గ్రామానికి చెందిన ఆదినారాయణ, మునీశ్వరి దంపతుల ఒక్కగానొక్క కుమారుడు మల్లికార్జున. ఇంటర్ వరకు చదివాడు. అనంతపురంలో కారు డ్రైవింగ్ నేర్చుకుంటుండేవాడు. తాను చనిపోతున్నానని శుక్రవారం తల్లిదండ్రులకు వాట్సాప్ ద్వారా మెసేజ్ పంపాడు. అనంతరం తల్లి మునీశ్వరికి వీడియో కాల్ చేసి లైవ్‌లోనే చెట్టుకు ఉరేసుకుని, చనిపోతున్నానన్నాడు. తల్లి మునీశ్వరి కన్నీరు మున్నీరుగా విలపించింది. 'చనిపోవద్దు.. నాన్నా..' అని ప్రాధేయపడినా వినకుండా ఉరేసుకున్నాడు. దీంతో మునీశ్వరి ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. మల్లికార్జున చనిపోయాడు. వెంటనే కుటుంబీకులు.. నార్పల పోలీసులకు సమాచారం అందించారు. ఇంతలోనే చెట్టుకు వేలాడుతున్న యువకుడి మృతదేహాన్ని అటుగా వెళ్తున్న వారు గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. నార్పల పోలీసుల సమాచారంతో మృతదేహం మల్లికార్జునదిగా గుర్తించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. దీనిపై బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

తెగని పంచాయితీ..!

- బదిలీల గడువు ముగిసినా ఖరారు కాని ప్లేస్‌మెంట్స్
- రోజుకో జాబితాతో కలెక్టర్ ఆమోదానికి..
- అంతుబట్టని ముగింపు ప్రక్రియ



అనంతపురం న్యూటౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ కార్యాలయంలో గ్రేడ్-5 కార్యదర్శి, గ్రేడ్-6 డిజిటల్ అసిస్టెంట్ల బదిలీల గడువు ముగిసినా నేటికీ ప్లేస్‌మెంట్స్ ఖరారు కాలేదు. పంచాయతీ అధికారులు రోజుకో జాబితాను కలెక్టర్ ఆమోదానికి పంపుతుండటంతో నే పంచాయితీ ఏర్పడిందన్న ప్రచారం జరుగుతోంది. అధికారులు చేసిన తప్పిదాలకు ప్రజా ప్రతినిధులతోపాటు కలెక్టర్ కూడా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది. గడువు ముగిసి 15 రోజులు గడుస్తున్నా బదిలీల జాబితాలో మార్పులు, చేర్పులకు అవకాశాలు కల్పిస్తుండటం వెనుక ముడుపుల బేరం ఉన్నట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. బదిలీల గడువు ముగిసే నాటికే స్థానిక ప్రజా ప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు అధికారులకు అందాయి. అందుకు అనుగుణంగా, మార్పుల్లేని రీతిలో బదిలీల ప్రక్రియ ముగించి ఉంటే ఇన్ని రోజులు ఈ తంతు నడిచేది కాదు. బదిలీల కౌన్సెలింగ్‌ను ఇష్టారాజ్యంగా చేపట్టడంతో నే సమస్యలు ఉత్పన్నమయ్యాయి.

అంతా గందరగోళం

ప్రారంభంలో స్పౌజ్, ఇతర మెడికల్ గ్రౌండ్స్ కింద వచ్చిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించకుండానే ఆప్షన్ ఫామ్స్ తీసుకొని పంపించేశారు. అనంతరం గందరగోళానికి తెరలేపారు. మిగిలిన వారితో సైతం రెక్వెస్ట్ ఫామ్స్ తీసుకొని ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు చేసుకొనే ప్రయత్నం చేశారు. అయితే మంచి ర్యాంకు వచ్చిన అభ్యర్థులు అడ్డు తగిలి నిరసనకు దిగారు. ఇది కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో స్పందించిన ఆయన అధికారులను పిలిపించుకొని గట్టిగానే క్లాస్ పీకినట్లు సమాచారం. దీంతో ర్యాంకుల వారిగా తిరిగి కౌన్సెలింగ్ నిర్వహించారు. సిఫార్సు లేఖలకు అవకాశం లేకుండా చేశారు. అయితే సిఫార్సులకు సంబంధించి స్థానిక నాయకుల నుంచి ఒత్తిళ్లు రావడంతో వాటికి అనుగుణంగా బదిలీల ప్రక్రియను సరిదిద్దారు. ఇది సమస్యగా మారింది. దీనికి తోడు సిఫార్సు లేఖలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం ఆలస్యం కావడంతో మరింతమంది లేఖలు పట్టుకొచ్చారు. ఆఖరికి సిఫార్సు లేఖలు తెచ్చుకొన్న వారికి మాత్రం ఉన్న ఖాళీలకు అనుగుణంగా బదిలీలు చేసి మమా అనిపించారు. సిఫార్సు లేకుండా తమకు ఉన్న సమస్యలను చెప్పుకొని ప్రాధేయపడ్డ వారికి న్యాయం చేయలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. యాడికి మండలంలో పని చేసేవారిని బొమ్మనహాళ్ మండలానికి బదిలీ చేశారు. అక్కడ మ్యూచువల్ ఉన్నారని కుటుంబసభ్యుల ఆరోగ్య పరిస్థితి బాగాలేదని, తగిన న్యాయం చేయాలని వారం రోజులుగా అధికారుల చుట్టు ప్రదక్షిణలు చేసినా కరుణించలేదు. ఇలా చాలా మంది బాధితులు గా మిగిలిపోయారు. అయితే బదిలీల ప్రక్రియ ఎప్పటికి ముగిస్తారన్నది అంతుబట్టకుండా ఉంది.

సీఎం సమీక్షలో ఎంపీ 'అంబికా'



పాల్గొన్న ఎంపీ అంబికా

అనంతపురం క్రైం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన సమీక్షలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉండవల్లిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, పార్టీ పార్లమెంట్ ఫ్లోర్ లీడర్ లావు కృష్ణదేవరాయలు, ఎంపీలు పాల్గొన్నారు. రాష్ట్ర అభివృద్ధి, కేంద్రం నుంచి ఏపీకి సాధించాల్సిన నిధులు, ప్రాజెక్టులు, ప్రజల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాల గురించి పార్లమెంట్‌లో తమ వాణి వినిపించేలా సీఎం దిశానిర్దేశం చేశారని ఎంపీ అంబికా తెలిపారు.

ఐదు రోజులు వానలు

బుక్కరాయసముద్రం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రానున్న ఐదు రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి శుక్రవారం తెలిపారు. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని అన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 34.5 నుంచి 35.7 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 25.2 నుంచి 25.4 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చని తెలిపారు. నైరుతి దిశగా గాలులు గంటకు 10కి.మీ. వేగంతో వీస్తాయని, గాలిలో తేమ ఉదయం పూట 73-78, మధ్యాహ్నం 46-52 శాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. అనంతపురం జిల్లాలో 19వ తేదీ 40 మి.మీ., 20న 14 మి.మీ., 21న 10 మి.మీ., 22న 15 మి.మీ., 23న 12 మి.మీ. వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాలో 19న 40 మి.మీ., 20న 14 మి.మీ., 21న 10 మి.మీ., 22న 15 మి.మీ., 23న 12మి.మీ. కురిసే అవకాశం ఉందని తెలిపారు.

రేపు ఇంటర్వ్యూలు

అనంతపురం అర్బన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): సీడాప్ ఆధ్వర్యంలో మెగా ఇంజనీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఎల్‌టీడీ సోలార్ ప్రైవేటు సంస్థలో ఉద్యోగ నియామకాలకు ఈనెల 20వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శైలజ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 20న ఉదయం 8.30 గంటలకు అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. నిరుద్యోగ యువకులు సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. సీనియర్ మేనేజర్, మేనేజర్, ప్రాజెక్టు మేనేజర్, సీనియర్ ఇంజనీర్, ఇంజనీర్, సూపర్‌వైజర్లు, టెక్నీషియన్లు, ఫీల్డ్ ప్లానింగ్ ఆపరేటర్స్, లిజనింగ్ ఎక్విజిషన్, మెయింటెనెన్స్ ఓఅండ్ఎం పోస్టులకు బీటెక్, డిప్లొమా అన్ని బ్రాంచ్‌ల అభ్యర్థులు అర్హులన్నారు. 18 నుంచి 45 సంవత్సరాలోపు వయసు, రెన్యుబుల్ ఎనర్జీ, సోలా ర్ పరిశ్రమలో ఏడాదికిపైగా అనుభవం కలిగి ఉండాలన్నారు. అకౌంట్స్, హెచ్‌ఆర్ పోస్టుల కోసం ఎంబీఏ చేసిన ఏడాదికిపైగా అనుభవం ఉన్న వారు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఉమ్మడి అనంత జిల్లాలో పనిచేయాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 08554-271122, 8985091256 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రేపు అరసం అభినందన సభ

అనంతపురం టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ముగ్గురు పురస్కార గ్రహీతలకు ఏపీ అభ్యుదయ రచయితల సంఘం(అరసం) ఆధ్వర్యంలో అభినందన సభ ఆదివారం నిర్వహిస్తామని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ తస్నీరు నాగేంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జిల్లాకు చెందిన సీనియర్ సాహితీవేత్తలు డాక్టర్ శాంతినారాయణకు సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం వారి ప్రతిభా పురస్కారం, బండి నారాయణస్వామికి డాక్టర్ రావూరి భరద్వాజ స్మారక పురస్కారం, తూంచర్ల రాజారాంకు మక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్ వారి సాహిత్య విమర్శ పురస్కాలు ఒకే నెలలో ప్రకటించిన సందర్భంగా ఈ అభినందన సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అరసం అనంత అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

గూగూడు హుండీ ఆదాయం రూ.31లక్షలు

నార్పల, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూగూడు కుళ్లాయి స్వామి దేవాలయంలో శుక్రవారం హుండీల ఆదాయాన్ని లెక్కించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయానికి రూ.31.3లక్షలు ఆదాయం వచ్చిందని ఈఓ శోభ తెలిపారు.

తిన్నది ఇచ్చేస్తాం.. ఎల్‌పీసీ ఇవ్వండి

- బతిమాలుతున్న బదిలీపై వెళ్లిన హెచ్‌ఎంలు
- కాంప్లెక్స్ నిధులు వెనక్కు ఇచ్చేందుకు తంటాలు
- 'ఆంధ్రజ్యోతి' కథనంతో ప్రకంపనలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం విద్య, జూలై 18(ఆంధ్రజ్యోతి): 'బాబ్బాబు.. పొరపాటైంది. నేను డ్రా చేసుకున్న కాంప్లెక్స్ నిధులు తిరిగి ఇచ్చేస్తా. నాకు ఎల్‌పీసీ ఇవ్వండి' అంటూ బదిలీపై వెళ్లిన హెచ్‌ఎంలు బతిమలాడుతుండటం ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. మూడు రోజుల కిందట రెండే మీటింగ్‌లు.. రూ.లక్ష డ్రా చేసుకొని వెళ్లారు శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై రాష్ట్ర సమగ్రశిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు సీరియస్‌గా స్పందించి, విచారణకు ఆదేశించారు. దీంతో డీఈఓ, ఎస్ఎస్ఏ ఏపీసీలు ఎంఈఓలు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో కాన్ఫరెన్స్ నిర్వహించి 'మీరు పెట్టిన బిల్లులు పరిశీలన చేయిస్తామని, అందరూ అన్నీ సిద్ధంగా ఉంచు కోవాలి' అని ఆదేశించారు. దీంతో నిధులు డ్రా చేసుకొని బదిలీపై వెళ్లిన ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలలో ఆందోళన మొదలైంది. కొందరు హెచ్‌ఎంలు ఆ డబ్బును వెనక్కు ఇచ్చి ఎల్‌పీసీ తీసుకొని వెళ్లడానికి సిద్ధమయ్యారు. అనంతపురం రూరల్ మండలం పరిధిలోని ఓకాంప్లెక్స్ హెచ్‌ఎం మరింత దిగొచ్చి తాను డ్రా చేసిన లక్ష రూపాయలు తిరిగిచ్చేస్తా.. ఎల్‌పీసీ ఇమ్మని రాయబారానికి దిగినట్లు సమాచారం. అయినా ఆ పాఠశాల కొత్త హెచ్‌ఎం 'మీరు ఏదో ఖర్చు పెట్టారని బిల్లులు పెట్టారు కదా సార్.. ఇపుడు ఆ లక్ష ఎలా ఇస్తారు? మీకు నష్టం కదా' అని ప్రశ్నిస్తే 'సార్ అదంతా వద్దు. ఇదిగో ఈస్కూల్ కాంప్లెక్స్‌కు వచ్చిన రూ.లక్ష ఇస్తున్నా తీసుకో. నాకెందుకు సమస్యలు. ఎల్‌పీసీ ఒక్కటి ఇస్తే చాలు నేను ప్రశాంతంగా వెళ్లి నా స్కూల్‌లో డ్యూటీ చేసుకుంటా' అని లక్ష రూపాయలు వెనక్కు ఇచ్చేశారట. బొమ్మనహాళ్, కళ్యాణదుర్గం, పుట్లూరు, గుత్తి, గంతకల్లు, రాయదుర్గం, బ్రహ్మసముద్రం, డి. హీరేహాళ్ మండలాల్లో వచ్చిన మొత్తం, ఖర్చుల వివరాలు అన్ని ఇచ్చి ఎల్‌పీసీ కోసం ప్రాధేయపడుతున్నట్లు సమాచారం. ఇంకొందరైతే తమ కాంప్లెక్స్ పరిధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలల టీచర్లతో మీకు కాంప్లెక్స్ నిధులతో ఫలానా టీఎల్ఎం మెటీరియల్ ఇచ్చామంటూ సంతకాలు పెట్టించుకొని వెళుతున్నారట. ఇలా కొందరు హెచ్‌ఎంలు కాంప్లెక్స్ గ్రాంట్స్ దోపిడీ నుంచి బయటపడటానికి నానా తంటాలు పడుతున్నారు.

● కాంప్లెక్స్‌లకు మళ్లీ నిధులు... నేడు తొలి సమావేశం

స్కూల్ కాంప్లెక్స్‌లకు ప్రభుత్వం మళ్లీ నిధులు విడుదల చేసింది. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి రాష్ట్ర సమగ్రశిక్ష శాఖ నిధులు మంజూరు చేసింది. ఒక్కో స్కూల్ కాంప్లెక్స్‌కు రూ.28,700లు చొప్పన జిల్లాలో 135కాంప్లెక్స్‌లకు గాను రూ.38.74లక్షలు విడుదల చేశారు. ఈవిద్యా సంవత్సరంలో శనివారం ఈ 135కాంప్లెక్స్ స్కూళ్లలో తొలి సమావేశాలు జరగనున్నాయి.

యూరియా కోసం షరతులు

- ఎరువు కావాలంటే క్రిమిసంహారక మందులు కొనాల్సిందే
- దుకాణదారుల ఆగడాలతో అన్నదాతల అగచాట్లు

కణేకల్లు, జూలై 18(ఆంధ్రజ్యోతి): దుకాణదారుల షరతులతో హెచ్చెల్సీ ఆయకట్టు రైతులు అల్లాడిపోతున్నారు. యూరియా కావాలంటే పురుగు మందులు కొనాల్సిందే అని చెబుతుండటంతో తలలు పట్టుకుంటున్నారు. మండలంలో ప్రతి ఏటా దాదాపు 22 వేల ఎకరాల్లో రైతులు వరిపంటను సాగు చేస్తుంటారు. వరి పైరు ఎదుగుదలకు యూరియా చాలా అవసరం. దీంతో ఎరువుల దుకాణదారులు కృత్రిమ కొరత సృష్టిస్తూ ఒక్కో బస్తాపై అదనంగా రూ. 20 వసూలు చేస్తున్నారు. అలాగే అమ్ముడుపోని క్రిమిసంహారక మందులు అంటగడుతున్నారు. మందులు వద్దన్న రైతులకు యూరియా స్టాక్ లేదని బుకాయిస్తున్నారు. తప్పని పరిస్థితులలో రైతులు క్రిమి సంహారక మందులు కూడా కొనుగోలు చేస్తున్నారు. ప్రతి ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో ఎరువుల దుకాణదారులు ఇలాగే వ్యవహరిస్తున్నారని చిన్న, సన్న కారు రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కృత్రిమ కొరత సృష్టిస్తే కఠినచర్యలు: ఏఓ జగదీష్

మండలంలో ఎవరైనా ఎరువుల దుకాణదారులు యూరియా కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం, అవసరం లేకున్నా క్రిమిసంహారక మందులు అంటగడితే కఠిన చర్యలు తప్పవు. జూన్ నెల నుంచి ఇప్పటి వరకు మండలానికి 450 టన్నులు యూరియా సరఫరా అయ్యిందన్నారు. అందులో ప్రభుత్వ సొసైటీల ద్వారా ఆధార్‌కార్డ్ ప్రామాణికంగా ఒక్కో రైతుకు ఐదు బస్తాల వరకు యూరియాను అందిస్తామన్నారు. యూరియా కోసం రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు.



యూరియా కోసం క్యూలైన్‌లో నిల్చున్న రైతులు

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



అశోక్(ఫైల్)

గుంతకల్లు టౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాతకొత్త చెరువు గ్రామ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వై అశోక్(24) మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు తిలక్ నగర్‌లో నివాసముంటున్న వై.సుబ్బరాయుడు, రామాంజినమ్మ కూరగా యల మార్కెట్‌లో ఆకుకూరల వ్యాపారం చేస్తూ జీవిస్తున్నారు. వీరి కుమారుడు అశోక్ కూడా తల్లిదండ్రులకు వ్యాపారంలో చేదోడుగా ఉండేవాడు. శుక్రవారం ఉదయం తన స్నేహితుడైన లోకేష్‌తో కలిసి ద్విచక్రవాహనంపై గుత్తికి వెళ్లాడు. తిరిగి గుంతకల్లుకు వస్తుండగా పాతకొత్తచెరువు గ్రామం వద్ద ప్రమాదవశాత్తు అదుపు తప్పి బైకు బోల్తా పడింది. దీంతో అశోక్ ఎగిరి రాయి మీద పడి, అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన లోకేష్‌ను చికిత్స గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లిదండ్రులు, బంధువులు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని బోరున విలపించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై ఎలుగుబంటి దాడి



గాయపడిన భూతరాజు

గుడిబండ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్ రాయాపురం గ్రామ సమీపాన శుక్రవారం పొలంలో పనులు చేసుకుంటున్న యువకుడు భూతరాజుపై ఎలుగుబంటి దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భూతరాజు ఉదయం తమ పొలానికెళ్లాడు. అటవీ ప్రాంతం పక్కనే ఉన్న పొలంలో పనులు చేసుకుంటుండగా ఒక్కసారిగా ఎలుగుబంటి దాడి చేసింది. తీవ్రంగా గాయపరచింది. భూతరాజు కూడా ప్రతిఘటించాడు. సమీప పొలాల్లోని రైతులు గట్టిగా కేకలు వేయడంతో ఎలుగుబంటి అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది. గాయపడ్డ భూతరాజును 108 వాహనంలో మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న అటవీశాఖ బీట్ ఆఫీసర్ మహదేవప్ప గ్రామానికి చేరుకుని, భూతరాజు కుటుంబ సభ్యులతో వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పొలాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భూతరాజును మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పరామర్శించారు.

ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణా తరగతులు మళ్లీ వాయిదా

అనంతపురం విద్య, జూలై18(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి, రెండు తరగతులు బోధించే టీచర్లకు నిర్వహించ తలపెట్టిన ప్రాథమిక భాష, గణిత నైపుణ్యాలు (ఎఫ్‌ఎల్‌ఎన్) శిక్షణాతరగతులు మళ్లీ వాయిదాపడ్డాయి. ఈనెల 21నుంచి 26వ తేదీ వరకు నిర్వహణకు సమగ్రశిక్ష రాష్ట్ర కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి. జిల్లా అధికారులు 5 డివిజన్లలో నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టారు. ఏం జరిగిందో తెలీదు కానీ, శిక్షణా తరగతులను మళ్లీ వాయిదావేస్తూ శుక్రవారం ఎస్పీడీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. దీంతో శిక్షణాతరగతులు వాయిదా వేసినట్లు సమగ్రశిక్ష ఏపీసీ శైలజ వెల్లడించారు. ఎప్పుడు నిర్వహించేదీ తర్వాత ప్రకటిస్తామన్నారు. ఈ వాయిదాను టీచర్లు గమనించాలని కోరారు. తొలుత పాఠశాలల ప్రారంభ సమయంలోనే శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. అడ్మిషన్లు, బడిబయట పిల్లల సర్వే, మెగా పీటీఎం కార్యక్రమాల నిర్వహణ నేపథ్యంలో టీచర్ల నుంచి వ్యతిరేకత వచ్చింది. దీంతో అప్పట్లో శిక్షణను వాయిదా వేసుకున్నారు. ఈనెల 21నుంచి నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టినా.. మళ్లీ వాయిదా వేయడంతో ఉపాధ్యాయ వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది.

మార్కెట్‌కు 1018 టన్నుల చీనీ కాయలు

అనంతపురం రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం 1018టన్నుల చీనీ కాయలు వచ్చినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు చెప్పారు. అలాగే కనిష్టంగా రూ.4వేలు, సరాసరి ధర రూ.10,500వేలు పలికినట్లు పేర్కొన్నారు.

ఎస్కేయూలో ఉద్యోగుల బదిలీ

అనంతపురం రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులను వివిధ విభాగాలకు బదిలీ చేశారు. ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు శుక్రవారం బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, మినిమం స్కేల్ ఉద్యోగులు మొత్తం 16 మందికి స్థానచలనం కలిగింది.



బాత్రూంలో పెయింటింగ్ వేస్తున్న ఉద్యోగి

ఇవేం పనులు..!

- ఆర్టీసీ ఉద్యోగులతో బాత్రూంలో పెయింటింగ్ పనులు

ఉరవకొండ, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులతో బాత్రూంలో పనులు చేయించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో ఉన్న బాత్రూంలో ఉద్యోగులతో శుక్రవారం పెయింటింగ్ పనులు చేయించారు. అందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఉద్యోగులతో బాత్రూంలో పనులు చేయించడం బాధాకరమని కార్మిక సంఘాల నాయకులు మండిపడుతున్నారు. డిపోలో పనిచేసే మెకానిక్, పెయింటర్, స్టోర్‌లో పనిచేసే ఉద్యోగులతో బాత్రూంలో పనులు చేయించారు. బయట వ్యక్తులతో శుభ్రం చేయించి, బిల్లులు పెట్టుకోవాల్సి ఉంది. ఆర్టీసీ అధికారులకు ఉద్యోగులు అంటే అలుసు అనీ, అందుకే ఇలాంటి పనులు చేయిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాధ్యులైన వారిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై డిపో మేనేజర్ హంపన్నను అడగ్గా.. బాత్రూంల్లో పెయింటింగ్ చేయించామని అంగీకరించారు.

శభాశ్.. హరీశ్..!

- పాయింట్స్‌మన్‌కు డీఆర్ఎం అభినందన



హరీశ్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న డీఆర్ఎం సీఎస్ గుప్తా

గుంతకల్లు, జూలై 18(ఆంధ్రజ్యోతి): తిరుపతి రైల్వే స్టేషన్‌లో అగ్ని ప్రమాదం విస్తరించకుండా చర్యలు తీసుకున్న పాయిట్స్‌మన్ హరీశ్‌ను డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా అభినందించారు. గుంతకల్లులోని రైల్వే డివిజనల్ కార్యాలయానికి రప్పించుకుని, శుక్రవారం ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. శాలువతో సన్మానించి, ప్రశంసాపత్రాన్ని, రివార్డును అందజేశారు. ఈ నెల 14న తిరుపతి స్టేషన్‌లో ఓ ఖాళీ బోగీలో మంటలు చెలరేగిన విషయం తెలిసిందే. దీన్ని గమనించిన పాయింట్స్‌మన్ హరీశ్, మంటలు వ్యాపించకుండా నిప్పంటుకున్న బోగీని ఇతర బోగీల నుంచి వేరుపరిచారు. రైల్వేకి ఆస్తి నష్టం జరక్కుంగా సమయోచితంగా వ్యవహరించారు. ప్రమాదం జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండటమే కాకుండా ప్రాణాలకు తెగించి, ధైర్యసాహసాలను ప్రదర్శించారని డీఆర్ఎం అభినందించారు.

పెన్షనర్లు ఆర్థిక అవగాహన పెంచుకోవాలి: డీఆర్ఎం

గుంతకల్లు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా రైల్వే ఉద్యోగులు, పెన్షనర్లు ఆర్థిక లావాదేవీలపై అవగాహన పెంచుకోవాలని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా సూచించారు. డీఆర్ఎం కార్యాలయంలోని రైల్వే ఆఫీసర్స్ క్లబ్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ లిటరసీ అండ్ సేఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అనే అంశంపై శుక్రవారం అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ డబ్బు వినియోగం విషయంగా డిజిటల్ లావాదేవాల ఆవశ్యకత పెరుగుతున్న కారణంగా రైల్వే ఉద్యోగులు, ముఖ్యంగా పెన్షనర్లు ఫైనాన్స్ ట్రాన్సాక్షన్ విషయంగా అవగాహన కలిగి ఉండాలన్నారు. పెన్షనర్లు తమ ఫైనల్ సెటిల్మెంట్లను పోస్టాఫీసులోని పొదుపు పథకాల్లోనూ, సీనియర్ సిటిజన్ పొదుపు పథకం (ఎస్‌సీఎస్ఎ)లో డిపాజిట్ చేసుకోవాలని సూచించారు. కార్య క్రమంలో రైల్వే బ్రాంచ్ అధికారులు, ఎస్బీఐ ఫైనాన్స్, పర్సనల్ బ్రాంచ్ అధికారులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబాలకు ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో వేర్వేరు కారణాలతో గత నెలలో మరణించిన ముగ్గురు హోంగార్డులకు జిల్లా ఎస్పీ జగదీష్ శుక్రవారం డీపీఓలోని తన చాంబర్‌లో ఆర్థిక సాయం అందించారు. శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన హోంగార్డు తిరుపాల్ నాయక్ కుటుంబానికి హోంగార్డుల ఒక రోజు వేతనం నుంచీ రూ. 4.32లక్షలు, ఫ్లాగ్ ఫండ్ కింద రూ. 10వేలు, నరసింహులు కుటుంబానికి రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించారు. అనంతపురం జిల్లాలో పనిచేస్తూ మరణించిన లక్ష్మిరెడ్డి కుటుంబానికి ఫ్లాగ్ ఫండ్ కింద రూ.10 వేల ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు పవన్ కుమార్, రాముడు, ఆర్ఎస్ఐ జాఫర్ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహించే ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ టీఎస్ చేతన్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో పీ4, పీజీఆర్ఎస్, వసతి గృహాల తనిఖీ తదితర అంశాలపై ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రజలకు చేర్చాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి బాధ్యతగా పనిచేయాలన్నారు. బంగారు కుటుంబాల ఎంపికపై గ్రామసభలు నిర్వహించాలన్నారు. జిల్లాలోని వసతి గృహాలను తరచూ తనిఖీ చేసి, విద్యార్థులకు సౌకర్యాలు సక్రమంగా అందుతున్నాయో లేదో పరిశీలించాలన్నారు. ఆర్డీవోలు కూడా పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ పథకాలు, సేవలపై ప్రజలనుంచి ఫీడ్‌బ్యాక్ సేకరించాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

న్యూస్ బాక్స్

'వ్యక్తిగత దూషణలు మానుకోండి'


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

నల్లచెరువు, జూలై 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మగ్బూల్ బాషా తమపై వ్యక్తిగత దూషణలు చేయిస్తున్నారని, వాటిని మానుకోవాలని నల్లచెరువు జడ్పీటీసీ సభ్యురాలు అనితమ్మ భర్త, ఆ పార్టీ నాయకుడు బసిరెడ్డి విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వైసీపీ నాయకుడు దశరథనాయుడు నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి విజయానికి తాము చేసిన సేవ ఎనలేనిదన్నారు. మగ్బూల్‌బాషా గురించి కార్యకర్తల మనోభావాలను అధిష్టానానికి తెలిపామన్నారు. ప్రతి మండలంలో వైసీపీ కన్వీనర్లతో తమపై వ్యక్తిగత దూషణలు చేయించారని మండిపడ్డారు. దశరథనాయుడు మాట్లాడుతూ.. మండల కన్వీనర్ సొంత ఇంటిలో పార్టీ కార్యక్రమాలు నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సోషల్ మీడియాలో జడ్పీటీసీ అనితమ్మను నల్లచెరువు నుంచి బహిష్కరిస్తామనడం అతడి రౌడీయిజానికి నిదర్శనమన్నారు. రానున్న ఎన్నికల్లో తమ సత్తా చాటుతామన్నారు. సమావేశంలో సర్పంచ్ పంచరత్నమ్మ, నాయకులు శ్రీధర్‌రెడ్డి, సమీవుల్లా, శ్రీనివాసులు, లక్ష్మీపతియాదవ్, ముస్తఫా, మౌలాలీ పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో పాము కలకలం


కిటికీకి చుట్టుకుని ఉన్న పాము

నంబులపూలకుంట, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం పాము కలకలం రేపింది. టైపిస్టు జకావుల్లా కుర్చీ వెనకల కిటికీ ఉంది. కార్యాలయానికి రాగానే కిటికీ తలుపులు తీయడానికి ప్రయత్నించగా పామును గమనించి వెంటనే గ్లాస్ డోర్ వేశారు. బయట జాలరీ ఏర్పాటు చేయడంతో పాము ఎటూ పోలేక ఇబ్బంది పడింది. తర్వాత కార్యాలయం మొత్తం తలుపులు వేసేసి కిటికీ తెరవడంతో వెళ్లిపోయింది. ఆవరణంలో పిచ్చిమొక్కలు ఎక్కువగా ఉండడంతోనే పాము వచ్చినట్లు తెలుస్తోంది.

మహిళలకు క్యాన్సర్ ఉచిత పరీక్షలు

బత్తలపల్లి జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం మహిళలకు క్యాన్సర్‌పై ఆర్డీటీ వైద్యులు జ్యోతి, సుప్రజ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాన్సర్ ముందస్తు నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ గురించి అవగాహన కల్పించారు. డి.చెర్లోపల్లిలోని ఎస్టీ కాలనీలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇంటింటా తిరిగి విష జ్వరాలు ప్రబలకుండా తీసుకోవాల్సి జాగ్రతలు వివరించారు.

శక్తియాప్ డౌన్‌లోడ్ చేసుకోండి

ముదిగుబ్బ, జూలై 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళలు, బాలికల భద్రత కోసం ప్రవేశ పెట్టిన శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ముదిగుబ్బ సీఐ శివరాముడు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో సీఐ మాట్లాడుతూ.. మహిళలు, విద్యార్థినులు, బాలికలు సెల్‌ఫోన్‌లలో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శక్తి బృందం, ఎంఈవో రమణప్ప, పాఠశాల హెచ్‌యం రమాదేవి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

బత్తలపల్లి, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని డి.చెర్లోపల్లికి చెందిన ఆదినారాయణ కుమారుడు గురుప్రసాద్ (25) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆదినారాయణ గత 25 సంవత్సరాలుగా బెంగళూరులో కూలి పనులు చేసుకుంటు జీవనం సాగించేవాడు. ఈ నెల మొహర్రం పండుగకు డి.చెర్లోపల్లికి వచ్చారు. 6వ తేది కట్టకిందపల్లి వెళ్లి తిరిగి వస్తుండగా బైకు అదుపుతప్పి బోల్తా పడి తీవ్రంగా గాయపడ్డాడు. బెంగళూరులో చికిత్స పొందుతూ మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సమయపాలన పాటించాలి

బత్తలపల్లి, జూలై 18(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో సమయ పాలన పాటించాలని సీడీపీఓ సరస్వతి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. తొలుత ప్రాజెక్ట్ యునియన్ లీడర్ వాసంతి మృతికి సంతాపం తెలిపి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. సమయపాలనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మొహర్రం ఉత్సవాలకు విరాళం

నంబులపూలకుంట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బత్తినగారిపల్లిలో నిర్వహిస్తున్న మొహర్రం ఉత్సవాలకు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ విరాళం ఇచ్చినట్లు మాజీ సర్పంచ్ శ్రీరాములనాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉత్సవాలు జరుగుతున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా.. రూ. 10 వేల విరాళం ఇచ్చారని వివరించారు. నగదును గ్రామస్థులకు అందచేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు జయచంద్రారెడ్డి, రమణారెడ్డి, వేణుగోపాల్‌కృష్ణ, సుధాకర్‌నాయుడు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులు రెన్యువల్ చేసుకోవాలి

కదిరిఅర్బన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 సంవత్సరంలో పనిచేసిన కాంట్రాక్టు అధ్యాపకులు రెన్యూవల్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కదిరి ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ స్మిత ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. అర్హులైన ఒప్పంద అధ్యాపకులు శనివారం వారు పనిచేస్తున్న కళాశాలలో ప్రిన్సిపాళ్లకు దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు జీతాలు మంజూరు చేయాలి

నంబులపూలకుంట, జూలై 18(ఆంధ్రజ్యోతి) : బదిలీ అయిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు మంజూరు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి డిమాండ్ చేశారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని ఎదురుదొన ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడుతూ.. బదిలీ ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలుచేయాలని, ఉపాధ్యాయులను బోధనకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, తిరుమల ప్రసాద్, రమేష్, కాంతమ్మ, గంగయ్య, రాజశేఖర్, సాంబశివారెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, ఓబులరెడ్డి, చిన్నోడు, శ్రీవాణి, స్రవంతి పాల్గొన్నారు.


సభ్యత్వం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

చెరువులకు హంద్రీనీవా నీరు చేరేనా..?

● అడుగంటుతున్న భూగర్భ జలాలు ● ఆయకట్టు సాగుకు దూరమవుతున్న రైతులు


కంపచెట్లతో నిండిన ఓడీసీ చెరువు

ఓబుళదేవరచెరువు, జూలై 18(ఆంధ్రజ్యోతి): అసలే మెట్ట ప్రాంతం. వర్షాలు సక్రమంగా కురిస్తేనే పంటలు.. లేకుంటే వేసవిలో తాగునీటికి కూడా ఇబ్బందులే. ఇలాంటి చోట హంద్రీనీవా జలాలు తీసుకొచ్చి ఆ ప్రాంతాలను సస్యశ్యామలం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఓడీ చెరువు, అమడగూరు, నల్లమాడ మండలాల్లో చెరువులకు హంద్రీనీవా నీటిని అందిస్తే ఆయకట్టు రైతులకు కొండంత ఆసరాగా ఉంటుంది. 2019లో ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీ చేసిన శ్రీధర్‌రెడ్డి తాను గెలిస్తే చెరువులకు నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. వాటిని ఆచరణలో పెట్టడం మరిచిపోయారు. రైతుల ఆశలు అడియాశలయ్యాయి. ఓబుళదేవరచెరువు మండలంలో 48 చెరువులు, అమడగూరులో 41, నల్లమాడ మండలంలో 42 చెరువులు ఉన్నాయి. ఈ చెరువుల్లో నీటిని నింపడానికి 2014లో అప్పటి ఎమ్మెల్యే పల్లె రఘునాథ్‌రెడ్డి, జిల్లాలో రెండో అతి పెద్ద చెరువైన బుక్కపట్నం చెరువుకు హంద్రీనీవా నీటిని తీసుకొచ్చారు. వీటితోపాటు నియోజకవర్గంలోని అన్నిచెరువులకు నీరు అందించేందుకు డీపీఆర్ సిద్ధం చేశారు. తరువాత వచ్చిన ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు వీటి గురించి పట్టించుకోలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే పల్లెసింధూరారెడ్డి హంద్రీనీవా నీటితో ఈ ప్రాంతాలను సస్యశ్యామయం చేయడానికి కార్యాచరణ చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. వలస పోవాలన్న మాట ఎక్కడ లేకుండా రైతులు మరో పదిమందికి ఉపాధి కల్పించే పరిస్థితి వస్తుంది. నియోజకవర్గంలో కరువు పరిస్థితులను వివరిస్తూ హంద్రీనీవా నీటిని అందించడానికి నిధులు మంజూరు చేయాలని అసెంబ్లీలో కూడా ఎమ్మెల్యే ప్రస్తావించారు. హంద్రీనీవా జలాలు చెరువులకు అందింతే ఈ ప్రాంతాలు సస్యశ్యామలమవుతాయి. కొన్నేళ్లుగా చెరువుల్లో నీరు లేకపోవడంతో ఆయకట్టుదారులు పంటలు పండించలేదు. చెరువులు, ఆకట్టు ప్రాంతాలు ముళ్లచెట్లతో నిండిపోయాయి. హంద్రీనీవా జలాలు చెరువులకు అందుతాయని రైతులు ఎదురు చూస్తున్నారు.

హంద్రీనీవా జలాలపైనే ఆశలు



చెరువులకు హంద్రీనీవా నీరు అందితే పంటలు పండించుకునే అవకాశం ఉంటుంది. గతంలో హంద్రీనీవా జలాలు అందిస్తామని చెప్పారేకానీ, ఇంతవరకు ఆచరణలోకి రాలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే చెరువులకు హంద్రీవా నీటిని అందించడానికి కృషిచేస్తున్నారు. చెరువులు నీటితో నింపితే వ్యవసాయబోర్లలో కూడా నీటిమట్టం పెరుగుతుంది.

-రామాంజనేయులు, రైతు, నారప్పగారిపల్లి

చెరువులు నింపితే వలసలు ఉండవు



హంద్రీనీవా నీరు చెరువులకు నింపితే, పంటలు సాగుకు డోకా ఉండదు. దీంతో రైతే పదిమందికి ఉపాధి కల్పించే అవకాశం ఉంటుంది. తద్వారా వలసలు ఉండవు. ప్రసుత్తం బోర్లలో నీటి మట్టం తగ్గుతోంది. చెరువులకు నీరు అందిస్తే నీటి మట్టం పెరగడంతోపాటు రైతుల పంటల సాగుకు అనుకూలమవు తుంది.

-నాగరాజు, రైతు, ఎం.కొత్తపల్లి

మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి: ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

పుట్టపర్తిరూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే అధికారులు, పాలకవర్గానికి పలు సూచనలు చేశారు. సత్యసాయిబాబా శతజయంత్యుత్సవాలను పురస్కరించుకుని అందరి సహకారంతో పట్టణానికి నూతనశోభను తీసుకొద్దామన్నారు. పేరుకుపోయిన పన్ను బకాయిలను వసూలు చేసి ప్రజల అవసరాలు, మునిసిపాలిటీ అభివృద్ధికి ఖర్చుచేయాలన్నారు. పన్నులు వసూలు చేయకుండా అభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. పుట్టపర్తిలో సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధాన్ని పాటిద్దామని, అందుకు ప్రతిఒక్కరి సహకారం అవసరమన్నారు. బాబా శతజయంతి ఉత్సవాలకు దేశవిదేశాల నుంచి భక్తులు తరలివస్తారని, అందుకు అనుగుణంగా పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. మున్సిపాలిటీలో పనిచేస్తూ మృతి చెందిన వారి స్థానాల్లో సంబంధిత కుటుంబీకులకు కారుణ్య నియామకం కింద ఒకరికి, ఐదుగురిని కొత్తగా ఉద్యోగ నియామకాలు చేపట్టామని, అందుకు కృషిచేసిన ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియచేస్తున్నట్లు కమిషనర్ క్రాంతికుమార్ తెలిపారు. సమావేశంలో చైర్మన్ ఓబుళపతి, కౌన్సిలర్లు, ఎస్ఈ సూర్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ శాతం పెంచాలి: కలెక్టర్


నాయకులతో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తి టౌన్, జూలై18(ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంపునకు కృషి చేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కలెక్టర్ టీఎస్ చేతన్ కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో ఓటరు జాబితా సవరణ, మార్పులుచేర్పులపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఓటరు తన ఓటుహక్కును వినియోగించుకునేలా చైతన్యం తీసుకురావాలన్నారు. 2026 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయించాలన్నారు. మృతిచెందిన, గ్రామం శాశ్వతంగా వదిలి వెళ్లిన, రెండుమార్లు ఓటరు నమోదైన వాటిని జాబితానుంచి తొలగిస్తామన్నారు. ఓటరు జాబితాలో పేర్లు, వయసు, చిరునామా మార్పులకు ఎన్నికల సంఘం అవకాశం కల్పిస్తోందన్నారు. వాటి నిర్వహణకు జిల్లావ్యాప్తంగా 1,576 మంది బూత్ లెవల్ అధికారులను నియమించామన్నారు. నియోజకవర్గానికి ఒకరిని ఎంపిక చేసి, ఇప్పటికే వారికి ఢిల్లీలో శిక్షణ ఇచ్చారన్నారు. ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్ మార్పులాంటి అంశాలపై నియోజకవర్గ స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, ఫిర్యాదులు స్వీకరించి, ఓటరు నమోదు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. బూత్‌లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి అర్హులైన వారిపేర్లు జాబితాలో నమోదు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో విజయసారథి, టీడీపీ నాయకుడు సామకోటి ఆదినారాయణ, బీజేపీ భరత్‌కుమార్, వైసీపీ రవినాయక్, జనసేన సతీష్‌కుమార్, బీఎస్పీ నాగరాజు, అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి


పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఐ నాయకులు

ధర్మవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ధర్మవరం పట్టణంలో ఈ నెల 31న జరిగే సీపీఐ జిల్లా రెండో మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, రైతుసంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక ఎన్జీఓహోంలో శుక్రవారం మహాసభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీసత్యసాయి జిల్లాలో కరువు కోరల్లో చిక్కుకుని నిత్యం నలిగిపోతోందదన్నారు. జిల్లాలో ఎక్కడ చూసినా ఆత్మహత్యలు, వలసలు జరుగుతున్నాయన్నారు. మహాసభల్లో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై పోరాటాలకు రూపకల్పన చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, నాయకులు జింకా చలపతి, జాన్సన్‌బాబు, రవికుమార్, రమణ, వెంకటనారాయణ, వెంకటస్వామి, శ్రీనివాసులు, కాటమయ్య పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల వేతనం పెంచాలి

ధర్మవరం, జూలై 18(ఆంధ్రజ్యోతి): వేతనం పెంచాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం రోజువారి పారిశుధ్యకార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో పనిచేస్తున్న రోజువారి పారిశుధ్య కార్మికులకు రూ.400 నుంచి రూ.600 పెంచాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతిపత్రాలు ఇస్తున్నా పట్టించుకోలేదన్నారు. దీంతో కార్మికులు సమ్మెలోకి వెళ్లాల్సి వచ్చిందన్నారు. కార్యక్రమంలో నాయకులు అయూబ్‌ఖాన్, నరేశ్, బాబు, లక్ష్మీఓబుళేశు, నాగరాజు, జయకృష్ణ పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి: సీఐ

బత్తలపల్లి జూలై 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సీఐ ప్రభాకర్, ఆర్డీటీ రీజనల్ డైరక్టర్ హనుమంతప్ప తెలిపారు. మండల కేంద్రమైన బత్తలపల్లి ఆర్డీటీ క్రీడామైదానంలో మూడు రోజులుగా ఇంటర్ స్కూల్ క్రికెట్ టోర్నమెంటు జరుగుతోంది. శుక్రవారం ఉదయం రామాపురం బాలికల జట్టు మాల్యవంతం బాలికల జట్టు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన రామాపురం జట్టు 10 ఓవర్లకు 83 పరుగులు చేసింది. తరువాత బ్యాటింగ్ చేసిన మాల్యవంతం జట్టు 72 పరుగులకు ఆలౌట్ అయింది. గర్ల్ ఆఫ్ ది మ్యాచ్ ప్రసూన, సిరీస్‌ను చరిత కైవసం చేసుకున్నారు. బాలుర మ్యాచ్‌లో బత్తలపల్లి, మాల్యవంతం జట్లు తలపడ్డాయి. ప్రతిభ కనబరిచిన మహేంద్ర మ్యాన్ ఆఫ్‌ద మ్యాచ్, భరత్ మ్యాన్ ఆఫ్‌ద సిరీస్ సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ముఖ్యమని తెలిపారు. విద్యార్థులకు జే ఇన్‌ఫ్రా అధినేత జగదీశ్వరరెడ్డి భోజనాలు ఏర్పాటు చేశారు. విజేతలకు సీల్డ్‌లను టీడీపీ నాయకుడు అప్పస్వామి స్పాన్సర్ చేశారు.

హాస్టల్‌ను తనిఖీ చేసిన తహసీల్దార్

ధర్మవరంరూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు లేకపోతే ఎలా అంటూ తహసీల్దార్ సురేష్‌బాబు అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం తహసీల్దార్ పట్టణంలోని గాంధీనగర్‌లోని సాంఘిక సంక్షేమ బాలుర హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా ముందుగా హాస్టల్ రికార్డులు, విద్యార్థులు పెడుతున్న భోజనశాలను పరిశీలించారు. అక్కడే విద్యార్థుల తాగుతున్న నీటిని పరిశీలించారు. తాగునీటి కొళాయిల వద్ద అపరిశుభ్రంగా ఉండటం, కొళాయిల్లో నీరు కూడా తగినంతగా రాకపోవడంతో ఆయన మండిపడ్డారు. విద్యార్థులకు కనీసం మంచినీరు కూడా అందించలేరా అంటూ సిబ్బందిపై ఆసహనం వ్యక్తం చేశారు. మరుగుదొడ్లు పరిశీలించారు. అక్కడ శుభ్రం చేయకపోవడంతో జారికిందపడే అవకాశం ఉందని విద్యార్థులే చెప్పడంతో మీ ఇంట్లో కూడా ఇలానే పెట్టుకుంటారా అంటూ మండిపడ్డారు. వెంటనే శుభ్రం చేయాలని ఆదేశించారు. తాత్కాలికంగా మంచినీరు క్యాన్‌లలో ఏర్పాటు చేయాలని వార్డెన్ శివశంకర్‌కు సూచించారు. అనంతరం భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పుట్టపర్తిరూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా పరిపాలన సాగిస్తున్నామని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి తెలిపారు. కోవెలగుట్టపల్లిలో నిర్వహించిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం అందచేస్తున్న సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయా అని వాకబు చేశారు. ఆగస్టు 15 నుంచి మహిళలక ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, బెస్తచలపతి, లక్ష్మీ, అంజినేయులు, సురేష్‌నాయుడు, రాజప్ప, మనోహర్, ఉమాపతి పాల్గొన్నారు.

● ధర్మవరం: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని టీడీపీ నాయకులు బొట్టు కిష్ట తెలిపారు. శుక్రవారం కేతిరెడ్డికాలనీలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు రవి, తిరుపాల్, రామకృష్ణ, శీన, ఓబుళపతి, వెంకటనారాయణ, సూరి, సత్తి, ఆనందరెడ్డి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు.

● నల్లమాడ : స్థానిక ఎస్సీ కాలనీలో శుక్రవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని మండల కన్వీనర్ మైలే శివశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటా కరపత్రాలు పంచుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కోట్లో మంజునాథ్, మహేష్, హరి పాల్గొన్నారు.




పుట్టపర్తి మండలం కోవెలగుట్టపల్లిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సింధూరారెడ్డి, ధర్మవరం కేతిరెడ్డి కాలనీ, నల్లమాడలో టీడీపీ నాయకులు..

సమస్య చెబుదామని పోతే.. తహసీల్దార్ ఆగ్రహం


తహసీల్దార్‌తో వాగ్వాదం చేస్తున్న కటారుపల్లి క్రాస్ ప్రజలు

గాండ్లపెంట, జూలై 18(ఆంధ్రజ్యోతి): తమ గ్రామ సమస్య పరిష్కారం కోసం వెళ్లిన ప్రజలపై తహసీల్దార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈమేరకు తమకు జరిగిన అన్యాయాన్ని గాండ్లపెంట మండలం కటారుపల్లిక్రాస్ వాసులు వివరించారు. కటారుపల్లిక్రాస్‌లో శ్మశానవాటిపై చర్చించడానికి పలువురు గ్రామస్థులు శుక్రవారం తహసీల్దార్ కార్యాయాలనికి వెళ్లారు. తమ సమస్య వినకుండా ఇన్‌చార్జ్ తహసీల్దార్ బాబురావు 'బయటకు వెళ్లిపోండి' అంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిపారు. శ్మశానవాటికలో కస్తూర్బా పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం రెవెన్యూ వారు స్థలం కేటాయించారు. ఈ విషయంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌తో చర్చించగా.. శ్మశానవాటికలో నిర్మాణాలు చేపట్టకూడదని చెప్పారు. ఎమ్మెల్యే మాటను బేఖాతర్ చేస్తూ కొలతలు వేయడానికి రెవెన్యూ అధికారులు కటారుపల్లి క్రాస్‌కు వచ్చారన్నారు. పలువురు గ్రామస్థులు తహసీల్దార్ వద్దకు వెళ్లి సమస్యను విన్నవించడానికి ప్రయత్రించగా.. పరిష్కరించకపోగా, బయటకు పోడంటూ మండిపడినట్లు వాపోయారు.

తడి, పొడి చెత్త వేరుగా ఇవ్వాలి: డీపీఓ

తనకల్లు, జూలై 18(ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఇళ్ల వద్దకు పంచాయతీ ట్రాక్టర్ వచ్చినప్పుడు తడి, పొడి చెత్తలను వేరుచేసి ఇవ్వాలని డీపీఓ సమత పేర్కొన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం తడి, పొడి చెత్తపై ఆమె పంచాయతీ కార్యదర్శులతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. తనకల్లులోని కుమ్మరవీధిలో మహిళలను పిలిచి తడి పొడి చెత్త వివరాలను తెసుకున్నారు. ఉదయం ట్రాక్టర్ ఇళ్లవద్దకు వచ్చినప్పుడు తడి, పొడిచెత్త వేరుచేసి ఇవ్వాలన్నారు. అనంతరం చెరువు వద్ద ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓలు రాజశేఖర్, మురళీ, పంచాయతీ కార్యదర్శులు క్రిష్ణమూర్తిరెడ్డి, జహీర్, సురేష్ పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేసిన ఆర్డీఓ

తనకల్లు, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పరాకువాండ్లపల్లి వద్ద చౌక డిపోల స్టాక్ పాయింట్‌ను కదిరి ఆర్డీఓ వీవీఎస్ శర్మ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులు పరిశీలించారు. గోడౌన్‌లోని స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాడైపోయిన సరుకులకు అధికారులతో చర్చించి వెనక్కు పంపాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ షాబుద్దీన్, సీఎస్‌డీటీ వెంకటరెడ్డి, స్టాకిస్టు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో మరమ్మతులు

ధర్మవరం, జూలై 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో గత కొన్నేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన మరమ్మతులకు వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ శ్రీకారం చుట్టారు. శుక్రవారం ఆసుపత్రిలో మౌలిక వసతుల మరమ్మతులు మొదలు పెట్టారు. ఈ పనులను బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ తిప్పేంద్రనాయక్, డాక్టర్ మాదవి, నాయకులు జింకా చంద్ర, ఓబుశేసు, శ్యామరావు, శ్రీనివాసులు, రాజు, లక్ష్మీనారాయణ, వెంకటేశ్ పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

ధర్మవరం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆర్డీఓ మహేశ్ ఆర్టీసీ డీఎం సత్యనారాయణరావుకు సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్‌ను తనిఖీ చేశారు. ఆర్టీసీ సేవల పట్ల నమ్మకాన్ని పెంచడం, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం తదితర వాటిపై డీఎంతో మాట్లాడారు.

పరిహారం ఇప్పించాలని రైతు కుటుంబం నిరసన

ఓబుళదేవరచెరువు, జూలై 18(ఆంధ్రజ్యోతి): నాలుగులైన్ల రహదారి విస్తరణలో భాగంగా తమ వ్యవసాయ పొలంలో రెండుబోర్లు, పైపులైన్, ఇతర సామగ్రి కోల్పోతున్నామని, అందుకు పరిహారం ఇప్పించాలని కోరుతూ రైతు కుటుంబం పోలీస్ స్టేషన్ వద్ద శుక్రవారం నిరసన తెలిపింది. రైతు ఇడగొట్టు వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పులంగపల్లి గ్రామ సచివాలయం వద్ద నాలుగులైన్ల రహదారి వద్ద తనకు వ్యవసాయ పొలం ఉందన్నారు. అందులో రెండుబోర్లు, పైపులైన్, ఇతర వ్యవసాయ సామగ్రిని కొల్పోతున్నామని, పరిహారం ఇచ్చాకే విస్తరణ పనులు చేయాలన అధికారులను నిలదీశామన్నారు. దీంతో పోలీసులు తనతోపాటు తన కుటుంబ సభ్యులను పోలీస్ స్టేషన్‌కు తరలించారన్నారు. తమకు పరిహారం ఇచ్చేంతవరకు పనులు చేయకూడదన్నారు. ఈవిషయంపై ఎస్ఐ మల్లికార్జునరెడ్డిని వివరణ కోరగా వ్యవసాయ పొలానికి సంబంధించి కోర్టులో ఉందని, దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు విస్తరణ పనులు చేస్తున్నారని, పనులను రైతు అడ్డుకోవడంతో ముందస్తు చర్యలో భాగంగా పోలీస్‌స్టేషన్‌కు తరలించి తరువాత బైండోవర్‌పై విడుదల చేశామన్నారు. ఈవిషయంపై నేషనల్ హైవే ఇంజనీర్ సుచితాను వివరణ కోరగా వ్యవసాయ బోర్లు, పైపులైన్ ఇతర సామాగ్రికి నష్టపరిహారం రెండుమూడురోజుల్లో జమ చేస్తామని పేర్కొన్నారు.


మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

ధర్మవరం, జూలై 18(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా ఏ రూపంలో వచ్చినా అరికట్టాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ధర్మవరం రైల్వే స్టేషన్ మేనేజర్ చల్లా నరసింహనాయుడు పేర్కొన్నారు. ఈనెల 30న ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా జరుగుతున్న మాసోత్సవాలలో భాగంగా వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు శుక్రవారం ధర్మవరం రైల్వేస్టేషన్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో జీఆర్పీ ఎస్ఐ వెంకటేశ్వరరెడ్డి, ఆర్పీఎఫ్ ఎస్ఐ కోటేశ్వరరావు, సమత స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ శ్రీనివాసులునాయుడు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆర్డీటీ సేవలు కొనసాగించాలి

ఓబుళదేవరచెరువు, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి సంబంధించిన ఎఫ్‌సీఆర్ఏను కేంద్రం వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ శుక్రవారం ఆ సంస్థ అభిమాన సంఘం ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. మం డలంలోని గౌనిపల్లి జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో విద్యార్థులచే పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. కార్యక్రమంలో ఆర్డీటీ అభిమాన సంఘం నాయకులు నాగేళ్ల బావన్న, రాజశేఖర్ విద్యార్థులు పాల్గొన్నారు. ఆర్డీటీ సేవలు కొనసాగించడానికి కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరుతూఏపీయూడబ్ల్యుజే, ప్రెస్‌క్లబ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం సమర్పించారు.

అండర్ -16 జిల్లా క్రికెట్ జట్టుకు కదిరి బాలుడు..



కదిరిఅర్బన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రక్రికెట్ సంఘం ఆధ్వర్యంలో కడపలో ప్రారంభమైన దక్షిణ మండల అంతర్‌జిల్లాల అండర్ 16 క్రికెట్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి జిల్లాజట్టుకు కదిరి క్రీడాకారుడు సంతోష్ ఎంపికైనట్లు కోచ్ నజీర్ తెలిపారు. కుడిచేతవాటం లెగ్స్ విన్నర్ అయిన సంతోష్ ఇటీవల జరిగిన జిల్లా ప్రాబబుల్స్ పోటీల్లో ప్రతిభ కనబరచి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు చెప్పారు. పట్టణంలోని సాధన పాఠశాలలో 10వతరగతి చదువుతున్నట్లు చెప్పారు. జిల్లా పోటీల్లో రాణించి, పైస్థాయి పోటీలకు ఎంపిక కావలని కదిరి క్రికెట్ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆకాంక్షించారు.

సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ధర్మవరం, జూలై 18(ఆంధ్రజ్యోతి): కదిరి పట్టణంలో ఈ నెల 27,28 తేదీలలో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జంగాలపల్లి పెద్దన్న పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ఈ మహాసభలలో భవిష్యత్తు చేపట్టబోయే కార్యక్రమాలను రూపొందిస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌హెచ్ బాషా, మారుతి, హైదర్‌వలీ పాల్గొన్నారు.

నేడు మంత్రి సవిత రాక

నల్లమాడ, జూలై 18(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ శాఖమంత్రి సవిత శనివారం నల్లమాడ రానున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ మైలే శివశంకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, పల్లె రఘునాథ్‌రెడ్డితో కలిసి పాల్గొంటారన్నారు.

భూసదస్సును విజయవంతం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న రైతు సంఘం, సీఐటీయూ నాయకులు

పెనుకొండ, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సోలార్ గ్రీన్ ఎనర్జీ పేరుతో కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే విషయంలో రైతులకు అన్యాయం చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం నంద్యాలలో జరిగే భూసదస్సులో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయం వద్ద భూసదస్సుకు సంబంధించి కరపత్రాలు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఈజ్‌ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో రోజుల వ్యవధిలోనే పెనుకొండ, మడకశిర, ఎన్‌పీకుంట, హిందూపురం, లేపాక్షి, రొద్దం మండలాల్లో 52వేల ఎకరాల ప్రభుత్వ భూములు, వ్యవసాయ భూములను సోలార్ గ్రీన్ ఎనర్జీ పేరుతో కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోందన్నారు. రైతుల భూములు సేకరించే ముందు వారిని సంప్రదించడం కానీ, అనుమతులు తీసుకోవడంకానీ, గ్రామసభలు నిర్వహించకుండా మంత్రివర్గం తీర్మానంచేసి బలవంతంగా భూములు లాక్కునేందుకు చూస్తోందన్నారు. మండల కార్యదర్శి బాబావలి, సివిల్ సప్లయ్స్ హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి గంగాధర్, రైతులు, కార్మికులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు



లేపాక్షి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గొంగటిపల్లిలో వెలసిన గ్రామదేవత ముత్యాలమ్మకు శుక్రవారం పూజలు నిర్వహించారు. గ్రామస్థులు మాట్లాడుతూ వర్షాలు బాగా కురవాలని, పంటలు బాగా పండాలని పశువులు వ్యాధులబారిన పడకుండా ఉండాలని ప్రతియేడాది ఆషాఢమాసంలో గ్రామదేవతకు ప్రత్యేక పూజలు, అన్నదాన చేపడుతున్నామన్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శాకంబరిగా కన్యకాపరమేశ్వరి



మడకశిర టౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీబజార్‌లో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు శుక్రవారం శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసం చివరి శుక్రవారం కావడంతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనేక మంది మహిళలు దర్శించుకొని లలితా సహస్రనామం, అమ్మవారి శతనామావళిని భక్తిశ్రద్ధలతో పఠించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కుబడులు చెల్లించారు.

పీర్ల ఊరేగింపు



పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

మడకశిర రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మానిపల్లి గ్రామంలోట పీర్ల ఉత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తురకవాండ్లపల్లి నుంచి పీర్లను ఊరేగింపుగా జమ్మానిపల్లి తీసుకెళ్లారు. భక్తులు చక్కెర చదివింపులు చేసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను జయప్రదం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

సోమందేపల్లి, జూలై 18(ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి రంగప్ప పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయ ఆవరణలో అనుబంధ సంఘాల నాయకులతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ 27, 28వ తేదీల్లో కదిరి పట్టణంలో రెండ్రోజులపాటు మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత మూడు సంవత్సరాల్లో చేసిన పోరాటాలు, రాబోయే రోజుల్లో చేపట్టే కార్యక్రమాలపై చర్చ ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలన్నారు. హనుమయ్య, లక్ష్మీనారాయణ, వెంకటేశులు, గౌతమి, ఈడిగ రామక్రిష్ణ, వెంకటేశులు, నాగభూషణ, రవి, గోవిందప్ప పాల్గొన్నారు.

ఆర్డీటీని పరిరక్షించండి



మానవహారం ద్వారా పోస్టుకార్డులను చూపుతున్న విద్యార్థులు

రొద్దం, జూలై 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేసి సంస్థను కాపాడాలని పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టారు. శుక్రవారం స్థానిక ఎంజేపీ పాఠశాలలో విద్యార్థులతో ఆర్డీటీ సహాయకులు పోస్టుకార్డులు రాయించి పోస్టులో వేయించారు. అనంతపురం ఉమ్మడి జిల్లాలో ఆర్డీటీ సంస్థ ప్రాణదాతగా ఉంటూ ఎంతోమందిని పేదరికం నుంచి గట్టెక్కించిందని, ఆ సంస్థ నేడు విరాళాలు రాక దుర్భిక్ష పరిస్థితుల్లో ఉందన్నారు. ఆర్డీటీ సహాయకులు గోపాల్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

గుడిబండ: పేద ప్రజల సంక్షేమాభివృద్ధి కోసం కృషిచేస్తున్న ఆర్డీటీని కాపాడాలని కోరుతూ విద్యార్థులు మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం ఎంజేపీ పాఠశాల విద్యార్థులు పురవీధుల్లో ర్యాలీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలని కోరారు. సంస్థ ప్రతినిధులు హనుమంతరాయప్ప, రఘు, శివకుమార్, అంజినప్ప, కరియప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్తకుప్పను తొలగించండి

చిలమత్తూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మూడు నెలలుగా చెత్తకుప్ప పెద్ద దిబ్బగా మారింది. కార్యాలయ ఆవరణలోనే అంగన్‌వాడీ కేంద్రం ఉంది. చిన్నారులు అక్కడే ఆడుకుంటూ ఉంటారు. దిబ్బగా మారిన చెత్తను తొలగించాల్సిన పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. అక్కడ అపరిశుభ్రతతో పాటు విషపురుగులకు నిలయంగా మారింది. దీంతో తల్లిదండ్రులు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపడానికి జంకుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు చెత్తకుప్పను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



ఎమ్మార్సీ ఆవరణలో ఉన్న చెత్తకుప్ప

శుభ్రతకు పెద్దపీట: మున్సిపల్ చైర్మన్



ధర్మపురం వార్డులో సమస్యలు తెలుసుకుంటున్న చైర్మన్ రమేష్

హిందూపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పరిశుభ్రతకు పెద్దపీట వేస్తామని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ధర్మపురంలో ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ మురుగుకాలువలో పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెట్ సముదాయం, పరిగిరోడ్డు, ప్రాంతాల్లో ఇటీవల చెత్త ఎక్కడ బడితే అక్కడ వేస్తున్నారని వాటిని వెంటనే డంపింగ్‌యార్డ్‌కు తరలించాలన్నారు. ఏసీపీ చంద్రమ్మ, ఏఈ జనార్దన్, వానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్, నిజాముద్దీన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి



పంప్‌హౌస్ వద్ద నిరసన తెలుపుతున్న తాగునీటి పథకం కార్మికులు

హిందూపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి వాటర్‌వర్కర్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కొట్నూరు వాటర్ పంప్‌హౌస్ వద్ద ఏఐటీయూసీ నాయకుడు వినోద్ మాట్లాడుతూ కార్మికులకు జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బాబు, రమేష్, రాజు, ఉమేష్, మంజునాథ్ పాల్గొన్నారు.

చట్టాలతోనే దివ్యాంగులకు రక్షణ



దివ్యాంగులకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రొద్దం, జూలై 18(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో దివ్యాంగులు చట్టాలు తెలుసుకోవడంద్వారానే రక్షణ పొందవచ్చని ప్రతిభా వికలాంగుల సొసైటీ నిర్వాహకులు వరలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం చిన్నమంతూరు గ్రామంలో దివ్యాంగుల చట్టాలపై అవగాహన కల్పించారు. దివ్యాంగులు ఆత్మస్థైర్యం కోల్పోకుండా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకుని న్యాయం పొందాలన్నారు. దివ్యాంగులు, గ్రామస్థులు, గణేష్ పాల్గొన్నారు.

గ్రామాలకు శుద్ధనీరు సరఫరా



మదర్‌ప్లాంట్ నుంచి శుద్ధనీరు గ్రామాలకు సరఫరా చేస్తున్న దృశ్యం

అగళి, జూలై 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రజలు ఫ్లోరైడ్ బారిన పడకుండా శుద్ధ నీటిని అందించేందుకు చర్యలు చేపట్టింది. నెల రోజులుగా నిలిచిపోయిన మినరల్ వాటర్‌ప్లాంట్‌కు మదర్‌ప్లాంట్ నుంచి శుక్రవారం శుద్ధనీటిని అందించారు. ఆ నీటిని వివిధ ట్యాంకర్ల ద్వారా గ్రామాలకు సరఫరా చేశారు. అగళి ప్లాంట్‌లో ఆగిపోయిన పనులను పూర్తి చేయించి సరఫరా చేయాలని జడ్పీటీసీ ఉమేష్, ఎంపీపీ రేణుక, కామరాజు ఆదేశించడంతో అధికారులు స్పందించి నీటి సరఫరాకు చర్యలు చేపట్టారు.

పీడబ్ల్యూడీ ఇంజనీర్‌కు ఉద్యోగోన్నతి

పావగడ, జూలై 18(ఆంధ్రజ్యోతి): తాలూకా ప్రజా పనుల శాఖ కార్యాలయంలో ఏఈఈ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న అనీల్‌కుమార్ తుమకూరు జిల్లా పీఎంజీఎస్‌పీ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పదోన్నతి రావడంతో శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయంలో కలిసి ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే స్పందిస్తూ తమ ప్రభుత్వ హయాంలో మరిన్ని సేవలు అందిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

టీడీపీ నాయకులకు సన్మానం

సోమందేపల్లి, జూలై 18(ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఆ పార్టీ నాయకులు రమణప్ప, రాజశేఖర్, ప్రసాద్‌లను ఘనంగా సన్మానించారు. గుడిపల్లి, వెలిదడకల, సోమందేపల్లి బూత్‌లలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమ ప్రచారాన్ని విజయవంతంగా పూర్తి చేసేందుకు వారిని సన్మానించినట్లు తెలిపారు. కన్వీనర్ వెంకటేశులు, పట్టణ అధ్యక్షుడు సూరీ, మాజీ ఎంపీటీసీ కిష్టప్ప, చలపతి, సోమశేఖర్, వడ్డె శ్రీరాములు పాల్గొన్నారు.

బియ్యం పట్టివేత

మడకశిర టౌన్, జూలై18(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలో శుక్రవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టారు. పావగడ నుంచి తుమకూరుకు అక్రమంగా తరలిస్తున్న 455 బస్తాల రేషన్ బియ్యాన్ని పట్టుకొన్నట్లు విజిలెన్స్ ఎస్ఐ జమాల్ బాషా తెలిపారు. ప్రభుత్వం అందించే రేషన్ బియ్యాన్ని ఎలాంటి బిల్లులు, అనుమతులు లేకుండా లారీలో తరలిస్తుండగా పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బియ్యం బస్తాలను మడకశిర స్టాక్ పాయింట్‌కు తరలించారు. పూర్తి వివరాలు జిల్లా విజిలెన్స్ ఎస్పీ వెల్లడిస్తారని స్థానిక అధికారులు తెలిపారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

హిందూపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): పిల్లల ఆరోగ్యంపై తల్లులు శ్రద్ధ చూపాలని డాక్టర్ కేశవులు అన్నారు. శుక్రవారం చిన్నపిల్లల వైద్యుల సమాఖ్య 28వ సంకల్ప సంపూర్ణ స్వాస్థ్య కార్యక్రమం పట్టణంలోని డీబీ కాలనీ పాఠశాలవద్ద నిర్వహించారు. చిన్న పిల్లల వైద్యుడు కేశవులు పాల్గొన్నారు. చిన్న పిల్లలకు అమ్మచేసిన ఆహారాన్ని మాత్రమే ఇవ్వాలన్నారు. డాక్టర్ రామచంద్రారావు, ఆదినారాయణ, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

గ్రామ వ్యవసాయ సహాయకుల బదిలీ

రొద్దం, జూలై 18(ఆంధ్రజ్యోతి): రొద్దం వ్యవసాయశాఖ పరిధిలో పనిచేసే విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు బదిలీ అయ్యారు. హార్టికల్చర్ అసిస్టెంట్లు ఐదుగురు ఉండగా ఇద్దరు ఇతర మండలాలకు బదిలీకాగా ముగ్గురు రొద్దం మండలలోనే బదిలీ స్థానాలు తీసుకున్నారు. సెరికల్చర్ అసిస్టెంట్లు ఇద్దరూ బదిలీ అయ్యారు. విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు ఆరుగురు ఉండగా ఇద్దరు ఇతర మండలాలకు, నలుగురు మండలంలోని సచివాలయాలకు బదిలీ అయినట్లు వ్యవసాయాధికారి రాజేష్ తెలిపారు.

పారిశుధ్య పనుల పరిశీలన

పరిగి, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని వన్నంపల్లి గ్రామంలో శుక్రవారం ఎంపీడీఓ రెడ్డప్ప పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి ప్రతిరోజూ ఉదయం డోర్‌టుడోర్ వెళ్లి చెత్తను సేకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి ఆదినారాయణ పాల్గొన్నారు.


సబ్సిడీ విత్తనాలు సద్వినియోగం చేసుకోండి

గుడిబండ, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు సబ్సిడీతో అందజేస్తున్న విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సింగిల్‌విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, ఏఓ వీరనరేష్ కోరారు. శుక్రవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో రైతులకు సబ్సిడీతో కంది విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. నాయకులు శ్రీనాథ్, భీమరాజు, దుర్గేష్, శివకుమార్, శ్రీరామ్, ఈరన్న పాల్గొన్నారు.

91 బంగారు కుటుంబాల ఎంపిక

మడకశిర రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆమిదాలగొంది గ్రామంలో శుక్రవారం పీ-4 గ్రామసభ నిర్వహించి 91 మంది బంగారు కుంటుంబాలను ఎంపిక చేసినట్లు స్పెషల్ ఆఫీసర్ భార్గవి తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఆమిదాలగొంది పంచాయతీలోని రెండు సచివాలయాల పరిధిలో పీ-4 సర్వేచేసి 369 కుటుంబాలను ఎంపిక చేశామన్నారు. గ్రామ సభలో కుటుంబాలు, వారి ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని 91 కుంటుంబాలను ఎంపిక చేసినట్లు తెలిపారు. పంచాయతీ సర్పంచు గీత, కార్యదర్శి రాజేశ్, నాయకులు రంగేగౌడ్, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశువైద్యశాల



పశువైద్యశాల పైకప్పు పెచ్చులూడి కడ్డీలు బయటపడిన దృశ్యం

అగళి, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలం మధూడి గ్రామంలోని పశువైద్యశాల శిథిలావస్థకు చేరింది. భవనం పైకప్పు రాలిపోయి కడ్డీలు కనిపిస్తున్నాయి. వైద్యశాలలో పనిచేసే సిబ్బంది బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. వర్షం వస్తే జలమయంగా ఉంటుందని, దీనికి తోడు పైకప్పు పెచ్చులూడి రాలిపోతున్నాయని ఆవేదన చెందుతున్నారు. కొన్నేళ్లుగా ఈ భవనం ఇదే పరిస్థితిలో ఉందని అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నూతన భవనం నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

పావగడలో వరుస చోరీలు

- ఒకే రోజు రెండిళ్లలో చొరబడిన దొంగలు
- విచ్చలవిడిగా జూదకేంద్రాలు
- కొరవడిన పోలీసు నిఘా



మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఇంట్లో బీరువాను పగులగొట్టిన దృశ్యం

పావగడ, జూలై 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలో దొంగతనాలు అధికమవుతున్నాయి. శ్రీనివాసనగర్‌లో ఉన్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సుమా అనిల్ ఇంట్లో, నల్లరాళ్ల గంగమ్మ వీధిలో ఉన్న ఉపాధ్యాయుడు పాండు ఇంట్లో శుక్రవారం మధ్యాహ్నం ఒకేసారి చోరీలు జరిగాయి. 21న ముఖ్యమంత్రి సిద్దరామయ్య పావగడకు వస్తున్న సందర్భంగా పోలీసులు, అధికారులు ఆయన రాకపై దృష్టి పెట్టడంతో దొంగలు దీన్ని ఆసరాగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్నారు. మరోపక్క వీరంపల్లి, కనికలబండ, అచ్చంపల్లి, గంగవరం, ఇతర ప్రాంతాల్లో జూదకేంద్రాలు అత్యధికంగా జరుగుతున్నాయి. చోరీకి ఇది కూడా ఓ కారణమై ఉండొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. పోలీసులు ముఖ్యమంత్రిరావడంపై దృష్టిపెడ్డంతో దొంగలు యథేచ్ఛగా చోరీలకు పాల్పడుతున్నారు. ఇంతవరకు పట్టణం అధ్వానస్థితిలో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి వస్తారని పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మున్సిపల్ అధికారులు, ప్రజాపన్నులశాఖ అధికారులు ఐదు రోజుల నుంచి కృషిచేస్తున్నారు. ఇప్పటి వరకు అధ్వానంగా ఉన్న డ్రైనేజీలు, చెత్త కుప్పలు, మట్టిదిబ్బలను తొలగించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. మధ్యాహ్నం పూట ఎవరూ లేని సమయంలో అధికారుల ఇళ్లను, నాయకుల ఇళ్లను టార్గెట్ చేసుకుని దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు నిఘా ఉంచి దొంగల నుంచి రక్షించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. రెండు ఇళ్లలో రూ.3లక్షలకుపైగా బంగారు వస్తువులు, రూ.లక్ష నగదును ఎత్తుకెళ్లినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



జూదకేంద్రం నిర్వహణకు శుభ్రం చేసిన స్థలం

అభివృద్ధికి చిరునామా టీడీపీ



తూముకుంటలో కరపత్రాలు అందజేస్తున్న శ్రీనివాసరావు, నాయకులు

హిందూపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి చిరునామా టీడీపీ అని ఆ పార్టీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో శుక్రవారం తూముకుంటలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అమలు చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వత్థనారాయణరెడ్డి, కన్వీనర్ రాము, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద్, అరుణాచల్‌రెడ్డి, చిక్కీరప్ప, రత్నమ్మ, నాగరాజు, ప్రదీప్, ఆంజనేయులు, ఆదినారాయణ, ఉమాశంకర్‌రెడ్డి, సర్పంచ్ మంజునాథ్, హనుమంతు, రామక్రిష్ణారెడ్డి, సూరీ, అంజినరెడ్డి, మూర్తి పాల్గొన్నారు.



పెనుకొండ రూరల్: కూటమి ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని నగర పంచాయతీ 20వ వార్డు బూత్ ఇన్‌చార్జి పోలీస్‌నారాయణనాయక్, చంద్రకాంతమ్మ అన్నారు. సుపపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. బూత్ కన్వీనర్ వెంకటేశ్ నాయక్, మనోహర్‌నాయక్, మిలిటరీ నారాయణప్ప పాల్గొన్నారు. గుట్టూరులో మాజీ సర్పంచ్ గుట్టూరు సూరీ, మల్లికార్జున, బొట్టు నాగరాజు పాల్గొన్నారు



పెనుకొండ: ప్రజాసంక్షేమమే టీడీపీ ధ్యేయమని నాయకులు అన్నారు. ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాలుగోవార్డు 153, 154బూత్‌లలో ప్రచారం చేశారు. క్లస్టర్ ఇన్‌చార్జి సూర్యప్రకాశ్, యూనిట్ ఇన్‌చార్జి కటిక కన్నా మాట్లాడుతూ కార్యక్రమాన్ని బూత్ 53, 54లో వందశాతం పూర్తి చేశామన్నారు. పాలడుగు చంద్ర, సాయి ప్రసాద్, సుధీర్, రేవణ, రామలింగ, లోకేష్, జిలాన్ పాల్గొన్నారు.



పరిగి: సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శ్రీరంగరాజులపల్లిలో క్లస్టర్ ఇన్‌చార్జి రామాంజనేయులు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం గత యేడాదికాలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. తెలుగుయువత ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవమ్మ, సీఎస్ రాము, అశోక్, చంద్ర, బాలాజీ, తిమ్మప్ప పాల్గొన్నారు.



గోరంట్ల: గ్రామాల్లో సింగిల్‌విండో అధ్యక్షులు బెల్లాచెరువు చంద్ర, మనోహర్ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. నాయకులు మూర్తి, హరీష్‌రెడ్డి, క్రిష్ణ, గంగాధర్, ఇర్షాద్ ఇంటింటికెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని, సంక్షేమపథకాలు వివరించారు.



రొద్దం: రాష్ట్రాభివృద్ధికి సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారని టీడీపీ నాయకుడు మాధవనాయుడు అన్నారు. శుక్రవారం పెద్దిపల్లి గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. హరి, టైలర్ ఆంజనేయులు, కుల్లప్ప, మాజీ డీలర్ శ్రీనివాసులు, చంద్ర, షన్ముఖ, మాజీ ఎంపీటీసీ అశ్వర్థ పాల్గొన్నారు.



గుడిబండ: సీఎం చంద్రబాబుతోనే ప్రజా సంక్షేమాభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, మద్దనకుంటప్ప అన్నారు. శుక్రవారం మండలంలోని ఎఫ్ఎస్ గుండ్లు గ్రామంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ సంక్షేమ పథకాలను వివరించారు. మంజునాథ్, బాలేపల్లిరాజు, ప్రకాశ్, శివకుమార్, ఆనంద్, పాల్గొన్నారు.

21న అడ్మిషన్లు

హిందూపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 21వ తేదీన బీఎస్సీ, బీకాం, బీఏ కోర్సుల ప్రవేశానికి అడ్మిషన్లు ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రగతి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సంవత్సరంలో చేరే విద్యార్థినులు ఇంటర్ మార్క్సు కార్డు, టీసీ, స్టడీసర్టిఫికెట్, ఆధార్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో కళాశాలలో సంప్రదించాలన్నారు. దూర ప్రాంత విద్యార్థులకు వసతి సదుపాయం కూడా ఉందన్నారు.

పదిమందిపై కేసు నమోదు

గోరంట్ల, జూలై 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్అండ్‌బీ ప్రహరీ కూల్చివేతపై ఇరువర్గాలు గురువారం రాత్రి ఘర్షణపడడంతో పదిమందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు. గోరంట్లలోని ప్రైవేటు స్థలం కోసం ఆర్అండ్‌బీ ఆధీనంలో ఉన్న ప్రహరీ, చెట్లను ఎక్స్‌కవేటరతో తొలగించినందుకు టీడీపీ నాయకుడు నిమ్మల యువశేఖర్‌తో పాటు 15మంది అనుచరులపై కేసు నమోదైన విషయం తెలిసిందే, కూల్చివేత ఘటనపై ఆర్అండ్‌బీ స్థలంలో ఉంటున్న ప్రైవేటు వాహనాల నిర్వాహకుల అసోసియేషన్ తరఫున అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆగ్రహించిన కూల్చివేత దారులు కదిరి రహదారిలో అసోసియేషన్‌కు చెందిన డ్రైవర్లతో రాత్రి ఘర్షణకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. ప్రజాజీవనానికి ఆటంకం కలిగించేలా ప్రవర్తించారన్న నేరంపై టీడీపీకి చెందిన నలుగురు, డ్రైవర్ల వర్గానికి చెందిన ఆరుగురిపై కేసునమోదుచేశారు. ఇరువర్గాలకు సంబంధించి జయక్రిష్ణ, మోహన్, రమేష్, అంజి, ఉబేదుల్లా, పాండురంగా, బాబ్‌జాన్, రఫీక్, సురేష్, సైతుల్లా కేసులో నిందితులుగా పేర్కొన్నారు.